తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : గద్దం నారరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
3 మార్చి 2025
సంపుటి : 248
సంచిక : 2
పేజీలు : 12
వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna



## గ్లోబల్ లీడర్లతో భారత్ కంపెనీలు పోటీ పడాలి

- కార్పొరేట్లు పరిశోధనలో పెట్టుబడి పెట్టాలి
- సృజనాత్మకత, ఆవిష్కరణలే భారత్ పెట్టుబడి
- ఆవిష్కరణలో ఐఐటీ హైదరాబాద్ అగ్రగామి
- కృత్రిమ మేధా నూతన శకానికి నూతన విప్లవం
- 'ఏక్ పేడ్ మాకే నామ్' పేరిట మొక్కను నాటిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్

మెదక్ తరంగాలు

నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు దేశ అభివృద్ధికి తోడ్పడాలని, ప్రస్తుతమున్న జనరేషన్ మార్పు, అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భారత కంపెనీలు గ్లోబల్ లీడర్లతో పోటీపడాలని భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ అన్నారు.

-మిగతా 2 లో



# ఈ పాపం కేసీఆర్ దే

### ఎస్ఎల్‌బీసీని పదేండ్లు పడావు పెట్టడంతోనే ప్రమాదం

- సైంధవుడిలా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- పాలమూరు రుణం తీర్చుకుంటా
- ఉమ్మడి జిల్లాలో 25 లక్షల ఎకరాలకు నీరు పారిస్తా
- వనపర్తి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

తరంగాలు-వనపర్తి

ఎస్ఎల్‌బీసీని పదేండ్ల పాటు పడావు పెట్టడంతోనే కుప్పకూలిందనీ, ఈ పాపం కేసీఆర్‌ది కాదా అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆంధ్రావాళ్లు రాయలసీమకు నీళ్లు తరలించుకు పోతుంటే గుడ్లప్పగించుకుంటూ కేసీఆర్ చూడలేదా అని విమర్శించారు. రోజమ్మ ఇంటికి పోయి రొయ్యల పులుసు తిని రాయలసీమను రతనాల సీమ చేస్తానని కేసీఆర్ అనలేదా.. అని గుర్తు చేశారు.

-మిగతా 2 లో

## నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

- మ్మెల్సీ ఎన్నికల లెక్కింపు కోసం మొత్తం 25 టేబుళ్లను ఏర్పాటు

నల్లగొండ తరంగాలు

రాష్ట్రంలోని ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడు ప్రారంభం కానుంది. లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కాగా, ఫిబ్రవరి 27న వరంగల్- ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన విషయం

-మిగతా 2 లో





## అధైర్య పడొద్దు అండగా ఉంటా.

- మల్కపేట రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయకుంటే రైతుల కోసం రోడ్డెక్కుతాం..
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇంటి ముందు కూర్చుంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

ఎల్లారెడ్డిపేట/ సిరిసిల్ల టౌన్

మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయకుంటే రైతుల కోసం రోడ్డు ఎక్కుతామని, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇంటి ముందు కూర్చుంటానని బీఆర్ఎస్ వర్కింగ్

-మిగతా 2 లో

## ఉగాది రోజు గద్దర్ ఫిలీం అవార్డుల ప్రదానం




- నాటకరంగ కళాకారులకూ అవార్డులు
- త్యాగరాజ ఆరాధనోత్సవాల మాదిరే భక్త రామదాసు జయంతి ఉత్సవాలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

హైదరాబాద్ తరంగాలు

నాటకరంగ కళాకారులకు కూడా అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. దీనికోసం విధివిధానాల రూపకల్పన జరగుతున్నదని చెపాపరు. రానున్న ఉగాది పండుగ రోజు సినీ కళకారులకు గద్దర్ ఫిలిం ఆవార్డులు అందిస్తామనీ, నాటక కళాకారులకు కూడా అదే రోజు ఇవ్వాలా, లేక మరోరోజు అవార్డులు ప్రదానం చేయాలో త్వరలో నిర్ణయిస్తామని వివరించారు. తెలంగాణ సంగీత నాటక ఆకాడమీ ఆధ్వర్యాన హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో

-మిగతా 2 లో



## అమెరికా అధికారిక భాషగా ఇంగ్లీష్

- ఆర్డర్‌పై ట్రంప్ సంతకం

వాషింగ్టన్‌తరంగాలు

అమెరికా అధికారిక భాషగా ఇంగ్లీష్‌ను పేర్కొంటూ ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన కార్యనిర్వాహక ఆదేశాలపై ఆయన సంతకం చేశారు. తాజా ఆదేశాలు ఫెడరల్ ప్రభుత్వ నిధులతో నడిచే ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు తమ సేవలను, పత్రాలను ఆంగ్లేతర భాషల్లో కొనసాగించాలా, వద్దా? అని

-మిగతా 2 లో



## అసెంబ్లీ ప్రొరోగ్

### -గవర్నర్ నోటిఫికేషన్ జారీ

తరంగాలు-హైదరాబాద్

శాసనసభ, శాసనమండలిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రొరోగ్ చేశారు. అందుకు అనుగుణంగా ఆదివారం ఆయన నోటిఫికేషన్ జారీ చేశారు. డిసెంబరులో ప్రారంభమైన సమావేశాలను ప్రొరోగ్ చేయకుండానే మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం, ఎస్సీ వర్గీకరణ, కులగణన నివేదికలపై తీర్మానాన్ని ఆమోదించాయి.

-మిగతా 2 లో



## బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

- సొరంగ నిర్మాణం మానవ అద్భుతం
- అవసరమైతే పూర్తిచేయడానికి రోబోలనూ ఉపయోగిస్తాం
- ఎస్ఎల్‌బీసీ ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్ తరంగాలు

"సొరంగం ప్రమాదంలో కార్మికులు చిక్కుకొని తొమ్మిది రోజులు అయ్యింది.. కాలం గడిచిన కొద్దీ బాధిత కుటుంబ సభ్యుల్లో ఆందోళన పెరిగిపోతోంది. ఆ కుటుంబాల వారిని అన్ని విధాలా ఆదుకుంటాం. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు సాగు, తాగు నీరు అందించే ఒక మహా అద్భుతాన్ని ఇక్కడ నిర్మిస్తున్నాం. ఇలాంటి కార్యక్రమంలో

-మిగతా 2 లో

# గ్లోబల్ లీడర్లతో భారత్ కంపెనీలు పోటీ పడాలి

(మొదటి తరువాయి)

సంగారెడ్డి జిల్లా కంది మండల పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆయన ఆదివారం పర్యటించారు. ఐఐటీ హైదరాబాద్‌లో జరుగుతున్న పలు ఆవిష్కరణల నేపథ్యంలో ఉప రాష్ట్రపతి పర్యటించారు. ముందుగా 'ఏక్ పేడ్ మాకే నామ్' పేరిట ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందానుద్దేశించి మాట్లాడారు. అభివృద్ధి, ఆవిష్కరణలపై కార్పొరేట్ పెట్టుబడి అవసరాన్ని ఎంతో ప్రాముఖ్యతగా తెలిపారు. సాంకేతికత, ఆవిష్కరణలు దేశ పురోగతి, భవిష్యత్‌ను తీర్చి దిద్దడానికి ఎంతో కీలకమవుతాయన్నారు. ఐఐటీల శాస్త్రీయ పరిశోధనలతో 20 కోట్ల మంది రైతులు నేరుగా బ్యాంకుల్లో ప్రోత్సాహం పొందుతున్నారని తెలిపారు. డిజిటల్ మార్కెటింగ్ అభివృద్ధి చెందిందన్నారు. విద్యార్థులు సృజనాత్మకతపై దృష్టి సారించాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత దేశం ఒక గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ఆలోచనలు, ఆవిష్కరణ, సాధనలో ఐఐటీ హైదరాబాద్ అగ్రగామిగా నిలచినందుకు ప్రశంసించారు. మౌలిక సదుపాయాలు అవసరమైనప్పటికీ 300 మంది అధ్యాపక బృందం అంకితభావం, కృషి, సృజనాత్మకతతో ఎన్నో విజయాల్ని సాధిస్తున్నందుకు అభినందిస్తున్నానని తెలిపారు. కృత్రిమ మేధస్సు ప్రతి క్షణం ఆదర్శవంతమైన మార్పును తీసుకొస్తుందని అన్నారు. ఐఐటీ హైదరాబాద్ నినాదం, లోగోను పరిశీలించినప్పుడు రెండూ కీలకమైనవిగా కనిపిస్తున్నాయన్నారు. మానవాళి కోసం సాంకేతికతను కనిపెట్టడం, ఆవిష్కరించడం గొప్ప విషయాలని గుర్తు చేశారు. జ్ఞానం విస్తరణ, పెరుగుదల అనే పదాలు తెలుగు నుంచి తీసుకోద్దాయని, భారత దేశం గొప్ప భాషల భూమి అని అన్నారు. సంస్కృతం, బంగ్లా, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ అనేక భాషలున్నాయని, పార్లమెంట్‌లో 22 భాషల్లో ఏకకాలంలో అనువాదం చేయబడుతుందన్నారు. మనం ప్రతి భాషనూ పెంపొందించుకోవాలన్నారు. నేటి యువత సముద్ర ఉపరితలం, లోతైన సముద్రం, భూమి, భూగర్భం, ఆకాశం, అంతరిక్షాన్ని మాత్రమే చూడాలన్నారు. టెక్ టైకూన్‌లు ఉద్భవిస్తున్నాయని, ఏ స్థాయిలోనైనా ప్రపంచ అగ్రశేణి కార్పొరేట్‌లో పనిచేసే ఒక్క భారతీయ ఆత్మను మనం చూడలేనే పరిస్థితి ఉందన్నారు. నేటి యువతే ఆ మార్పును తీసుకురావాలన్నారు. మీ మనస్సులో అద్భుతమైన ఆలోచనలు ఉంచుకోవాలన్నారు. పచ్చిమ దేశాల్లో మీ సహచరులు ఏమి చేస్తున్నారో పరిశీలించమని కోరారు. ఐఐటీ విద్యార్థులు, అధ్యాపకులను పార్లమెంట్ సందర్శనకు తాను అతిథులుగా ఆహ్వానిస్తూ మేథోమధన సెషన్స్ నిర్వహిస్తున్నా మన్నారు. ఐఐటీ హైదరాబాద్ అధ్యాపక బృందం, విద్యార్థులు సైతం రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐఐటీ చైర్మెన్ బీవీ మోహన్‌రెడ్డి, ఐఐటీ డైరెక్టర్ బీఎస్ మూర్తి, ఎంపీ రఘునందర్‌రావు, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు

(మొదటి తరువాయి)

తెలిసిందే. ఐదు రోజులుగా ఎదురు చూస్తున్న ఫలితాలు నేడు అభ్యర్థుల భవితత్వాన్ని తేల్చనున్నాయి. ఇదిలా ఉంటే గెలుపుపై అభ్యర్థులు ఎవరి దీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మొత్తం ఓటర్లు 25,797 ఉండగా 24,133 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఓట్ల లెక్కింపును నల్లగొండ పట్టణంలోని అర్జాలబావి దగ్గరున్న పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టినట్టు, సర్వం సిద్ధం చేసినట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల లెక్కింపు కోసం మొత్తం 25 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. టేబుల్‌కు నలుగురు చొప్పున సిబ్బంది ఉంటారు. మొత్తం ఓటర్లు 25797 ఉండగా 24133 మంది. ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకున్నారు.25 టేబుళ్లలో 24133 ఓట్లను లెక్కించడానికి సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ మొదలు కానుంది. కాగా, పోటీలో అలుగుబెల్లి నర్సిరెడ్డి, పులిసరోత్తం రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి పింగిళి, పూల రవీందర్, గాల్రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.సుందరరాజు, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, లింగిడి వెంకటేశ్వర్లు, అర్వస్వాతి, కంటె సాయన్న, పన్నాల గోపాల్రెడ్డి, ఏలె చంద్రమోహన్, చాలిక చంద్రశేఖర్, జంకిటి కైలాసం, జి.శంకర్, తలకోల పురుషోత్తంరెడ్డి, తాటికొండ వెంకటరాజయ్య, దామెర బాబురావు, బంక రాజు ఉన్నారు.

# ఈ పాపం కేసీఆర్‌దే

(మొదటి తరువాయి)

కృష్ణా జలాలను ఆంధ్రాకు తరలించుకు పోతున్నారంటే అది కేసీఆర్ దుర్మార్గం వల్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. 811 టీఎంసీలుండే కృష్ణా జలాల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరిగేలా 500.12 టీఎంసీలు తీసుకెళ్లేలా సంతకం పెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని అన్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, ప్రణాళిక బోర్డు వైఎస్ చైర్మెన్ చిన్నారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవా లకు శ్రీకారం చుట్టారు. వనపర్తి జీజీహెచ్ భవన నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణం, జెడ్‌పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల, జూనియర్ కాలేజీ భవనాలు, వనపర్తి ఐటీ టవర్, శ్రీ రంగాపురం దేవాలయం పనులు, పెబ్బేరు 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి భవనం, రాజానగరం, పెద్దమందడి బీటీ రోడ్డు నిర్మాణ పనులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు తదితర పనులకు శంకుస్థాపనలు చేశారు.అంతకుముందు వనపర్తి జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ఆయన వనపర్తిలో 12 సంవత్సరాలపాటు అద్దెకు ఉన్న ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటి యజమాని సీఎంకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి ఆ ఇంటితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తన పాఠశాల గురువులు, మిత్రులతో కలిసి సీఎం భోజనం చేశారు. వనపర్తి కేడీఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. రుణమేళా, జాబ్ మేళా స్టాల్స్‌నూ పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వనపర్తిలో పుట్టి.. అచ్చంపేటలో పెరిగి.. చదువు, సంస్కృతి నేర్చుకొని, కొడంగల్ నుంచి రాజకీయంగా రాణిస్తున్న తాను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉమ్మడి పాలమూరు జిల్లా రుణం తీర్చుకుంటానని అన్నారు. రాష్ట్రంలో వనపర్తికి ప్రత్యేక గుర్తింపు ఉందని, కానీ ఐదేండ్ల క్రితం వనపర్తిలో గెలిచిన ఎమ్మెల్యే రాజకీయాలను కలుషితం చేశారని తెలిపారు. పాలమూరు బిడ్డలకు పరిపాలించే శక్తి లేదా అని ప్రశ్నించారు. పాలమూరు వాళ్లది అమాయకత్వం కాదని, మంచితనమని, తిక్క రేగితే డొక్క చీల్చి డోలు కడతం జాగ్రత్త అని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదినది పాలమూరు బిడ్డ జిల్లెల చిన్నారెడ్డి అని చెప్పారు. వనపర్తిలో అనేక విద్యాసంస్థలకు కాంగ్రెస్ ప్రభుత్వాలే పునాది వేశాయన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే 25.50 లక్షల మంది రైతులకు రూ.22 వేల కోట్ల రుణమాఫీ జరిగిందా లేదా గుండెలపై చేయి వేసుకొని చెప్పాలని కోరారు. రూ.7625 కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో వేశామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 16 వేల మెగావాట్లకు పైగా పెరిగినా ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా చూస్తున్నామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని తెలిపారు. 150 కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేశారని, దాని కోసం ఆర్టీసీకి రూ.4500 కోట్లు చెల్లించామన్నారు. వనపర్తి సాక్షిగా ఈ రోజు రూ.1000 కోట్ల రుణాలను ఆడబిడ్డలకు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో 65 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయన్నారు. స్వయం సహాయక సంఘాలను ఆదుకునే బాధ్యత తనదేనన్నారు. హైటెక్ సిటీ శిల్పారామం పక్కనే స్వయం సహాయక మహిళల కోసం 150 స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థల పక్కనే మహిళా సంఘాలకు మూడున్నర ఎకరాల స్థలం ఇస్తారని ఎప్పుడైనా ఊహించారా.. అని మహిళలను ఉద్దేశించి సీఎం అన్నారు. 1000 బస్సులను స్వయం సహాయక మహిళలతో కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా చేశామన్నారు. రాష్ట్రంలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరుతో ఇస్తున్నామన్నారు. పదేండ్లలో నిరుద్యోగ యువతకు కేసీఆర్ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. కానీ ఆయన కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పడుకుని ప్రజల గురించి ఆలోచించలేదన్నారు. ఆయనే ప్రాజెక్టులు కడితే పాలమూరు ప్రజలు ఎందుకు వలస పోతున్నారని ప్రశ్నించారు. వలసలు పోతున్న పాలమూరు ప్రజల గురించి కేసీఆర్ ఏనాడైనా ఆలోచించారా అని నిలదీశారు. పదేండ్లలో పాలమూరు ఎత్తిపోతలతో పాటు బీమా, కల్వకుర్తి, నెట్టంపాడు ఎందుకు పూర్తి చేయలేదని, ఆర్డీఎస్ ఎందుకు ఎండిపోయిందని కేసీఆర్ చెప్పాలని నిలదీశారు.

# అధైర్య పడొద్దు అండగా ఉంటా.

(మొదటి తరువాయి)

ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. సిరిసిల్ల జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని దేవుని గుట్ట తండాలో సందర్శించారు. సాగునీరు అందక రైతుల పొలాలు ఎండిపోతున్నాయని, వారికి ధైర్యం ఇవ్వడానికి వచ్చానని అన్నారు. సంబంధిత మంత్రితో మాట్లాడటం జరిగిందని, రెండు రోజుల్లో నీటిని విడుదల చేస్తానని హామీ ఇచ్చారన్నారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేయకుంటే రైతుల పక్షాన ఉద్యమాలు చేస్తామన్నారు.

ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ 1500 ఎకరాలను కాపాడడానికి ఈ కాలువను నిర్మించారన్నారు. కాళేశ్వరం నీళ్లు వచ్చాయని చాలా ఆశతో పంటలు వేసుకోవడమే కాకుండా కొత్తగా 150 కొత్త మోటర్లు కొనుగోలు చేసి కాలువల మీద మోటర్లు పెట్టుకొని 'ఆ నీళ్లు వస్తే సాగు అవుతాది, మా జీవితాలు మేము ఆశించిన విధంగా మంచిగా అవుతాయి' అని రైతులందరూ డిసెంబర్, జనవరి మాసంలో వరి పంట నాటు వేశారన్నారు. వేసిన తరువాత కేసీఆర్ మీద కోపంతో కుట్రపూరితంగా అక్కడి నుంచి నీళ్లు తీసుకోకుండా కాళేశ్వరం పాడైపోయిందని చెప్పి అసత్యపు ప్రచారం చేశారని, దాని వల్ల రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు.

**అధైర్య పడొద్దు అండగా ఉంటా.. : టీ స్టాల్ నిర్వాహకునికి కేటీఆర్ భరోసా**

ఆధైర్యపడొద్దు అండగా ఉంటానని సిరిసిల్లలోని 'కేటీఆర్' టీ స్టాల్ నిర్వాహకుడు బత్తుల శ్రీనివాస్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. కొన్ని రోజుల క్రితం మున్సిపల్ అధికారులు బత్తుల శ్రీనివాస్‌కు చెందిన టీ స్టాల్‌ను తొలగించగా, సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన కేటీఆర్‌ను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులు కలిశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. రూ.10లక్షలు ఖర్చయినా సరే శాశ్వత ఉపాధి చూపిస్తానని, మంచి టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకోమని తెలిపారు. వారం రోజుల్లో వచ్చి తానే ప్రారంభిస్తా అని, అద్దె భారం లేకుండా ప్రత్యామ్నాయ మార్గం చూపిస్తా అని భరోసా కల్పించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెళ్లకు చెందిన అబ్బాడి రాజిరెడ్డిని కేటీఆర్ పరామర్శించారు. గరీబొల్లమీద కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తుందన్నారు. తన వల్ల మీరు జైల్‌కు వెళ్లావంటూ రైతుకు కేటీఆర్ క్షమాపణ చెప్పారు. కేసుల గురించి భయపడవద్దని, అన్నీ తాను చూసుకుంటానన్నారు.

# అమెరికా అధికారిక భాషగా ఇంగ్లీష్

(మొదటి తరువాయి)

ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. "ఇంగ్లీష్ అధికారిక భాషగా ఏర్పాటు చేయడం వల్ల సంభాషణలు క్రమబద్ధీకరించడమే కాకుండా ఉమ్మడి జాతీయ ప్రయోజనాలు బలోపేతమవుతాయి. సమ్మిళిత, సమర్థవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు" అని ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఈ పరిణామం దేశంలో ఐక్యతను ప్రోత్సహిస్తుందని.. ప్రభుత్వ కార్యక్రమాల్లో సమర్థతను నెలకొల్పుతుందని వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. పౌరుల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు మార్గాన్ని ఏర్పరుస్తుందని వైట్‌హౌజ్ అభిప్రాయపడింది. ఇంగ్లీష్‌ను అధికారిక భాషగా గుర్తిస్తూ ఇప్పటికే అమెరికాలోని 30 రాష్ట్రాలు చట్టం చేసినట్టు సమాచారం. అయితే, అమెరికా అధికార భాషగా గుర్తింపు కోసం కాంగ్రెస్ చట్టసభ సభ్యులు దశాబ్దాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ అవి సఫలం కాలేదు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోనే వైట్‌హౌస్ వెబ్‌సైట్ స్పానిష్ వెర్షన్‌ను తొలగించారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడయ్యాక ఇదే విధంగా చేసినప్పటికీ.. బైడెన్ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించడం గమనార్హం.

# ఉగాది రోజు గద్దర్ ఫిలీం అవార్డుల ప్రదానం

(మొదటి తరువాయి)



జరిగిన భక్త రామదాసు జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని, ప్రసంగించారు. తిరువాయూర్‌లో జరిగే త్యాగరాజ ఆరోధనోత్సవాల తరహాలో రాష్ట్రంలో భక్త రామదాసు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో కళలు, కళాకారులను ఆదరిస్తుందనీ, వారికి కావలసిన అన్ని రకాల వసతులు, సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. భక్త రామదాసు 392 జయంతి ఉత్సవాలను ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రముఖ సంగీత విద్వాంసులు పద్మశ్రీ డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు, పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, కళారత్న పురస్కార గ్రహీతలు హైదరాబాద్ బ్రదర్స్ రాఘవాచారి, హైదరాబాద్ సిస్టర్స్ హరిప్రియ, ప్రేమా రామమూర్తి, కోవెల శాంత, డీవీ మోహన్ కృష్ణ తదితరులను శాలువాలు, పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి తెలంగాణ నాటక అకాడమీ చైర్మెన్ అలేఖ్య పుంజాల అధ్యక్షత వహించారు.

# బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

(మొదటి తరువాయి)

ప్రమాదాలు జరగడాన్ని చింతిస్తున్నాం" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శ్రీశైలం దోమలపెంట వద్ద సొరంగంలో జరిగిన ప్రమాద ఘటనా స్థలాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా అధికారులు, కార్మికులతో సమీక్ష చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కార్మికుల రక్షణకు ఆటంకంగా మారిందన్నారు. ఊబికి వస్తున్న నీళ్ల వల్ల సహాయ చర్యలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. ముఖ్యంగా ప్రమాద స్థలంలో భీకర పరిస్థితులు నెలకొన్నందున ఇక నుంచి రోబోలను సైతం వాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు. 4000 క్యూసెక్కులు, 30 టీఎంసీల నీటిని వాడుకోవడానికి 2005-06లో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మూలకు పడేసిందన్నారు. పనులు చేయకపోగా కనీసం విద్యుత్ బిల్లులు కూడా ఇవ్వకుండా కాంట్రాక్టర్లను ఇబ్బందులు పెట్టిందని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సాంకేతిక సమస్యలను పరిశీలించి నిపుణులను పిలిపించి ఇక్కడి సొరంగం పనులు ఎలా పూర్తి చేయాలో తెలుసుకున్నామన్నారు. కొన్ని విడిభాగాలను అమెరికా నుంచి తెప్పించి మొదలు పెట్టామని తెలిపారు. పనులు జరుగుతున్న క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఇంజనీర్లు, కార్మికులు ప్రమాదంలో ఇరుక్కోవడం దురదృష్టకరమన్నారు. తొమ్మిది రోజులుగా దేశ, విదేశాల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రయివేటు ఏజెన్సీల నుంచి వచ్చిన నిపుణులను సైతం సొరంగంలో చిక్కుకున్న కార్మికులను కాపాడడానికి ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఆర్మీ, నేవీ, హైడ్రా వంటి 11 సంస్థలు, 500 మంది నిపుణులు ఇక్కడ రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేయడం అభినందనీయమన్నారు. కూలిన మట్టి, నీటి ఊటను తొలగించడానికి ఉపయోగించే కన్వర్ బెల్ట్‌ను మరమ్మతు చేస్తే రెండు రోజుల్లో కార్మికులను వెలికితీసే అవకాశం ఉందని తెలిపారు.

# అసెంబ్లీ ప్రోరోగ్

(మొదటి తరువాయి)

ఈ నెలలో బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. తాజాగా ఉభయసభలను ప్రోరోగ్ చేస్తూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించాల్సి ఉంటుంది. అసెంబ్లీ, మండలిని సమావేశపరిచేందుకు వీలుగా గవర్నర్ మరో నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది.



# ఏడుకు చేరిన ఉత్తరాఖండ్ మృతుల సంఖ్య

- మరొకరి ఆచూకీ కోసం గాలింపు



**డెహ్రాడూన్ తరంగాలు**
ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లా మనా గ్రామంలో మంచు చరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరింది. మంచుదిబ్బల కింద కూరుకుపోయిన మరో మూడు మతదేహాలను ఆదివారం రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. దాంతో మృతుల సంఖ్య ఏడుకు పెరిగింది. రెండ్రోజుల క్రితం బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కార్మికుల శిబిరంపై మంచు చరియలు విరిగిపడిన ఘటనలో 58 మంది చిక్కుకున్న విషయం తెలిసిందే. వెంటనే ఆర్మీ, సహాయక బందాలు రంగంలోకి దిగి 54 మందిని బయటకు తీశారు. వారిని ఎయిర్‌లిఫ్ట్‌తో జోషి మఠ్ ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. వారిలో తీవ్రంగా గాయపడిన నలుగురు కార్మికులు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆచూకీ దొరకని మిగతా నలుగురి కోసం గాలింపు కొనసాగించగా.. ఆదివారం ఉదయం మరో మూడు మృతదేహాలు బయటపడ్డాయి. మరో కార్మికుడి జాడ తెలియాల్సి ఉంది. రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనేందుకు జోషిమఠ్ నుంచి మరో ఎస్‌డీఆర్‌ఎఫ్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుంది. థర్మల్ ఇంజిన్ కెమెరా సాయంతో మంచులో చిక్కుకున్న వారి కోసం గాలించారు

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం



**శంషాబాద్ తరంగాలు**
సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనేందుకు ఆదివారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి భారత ఉప రాష్ట్రపతి దంపతులు జగదీప్ ధన్కర్, సుదేష్ ధనర్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకు న్నారు. విమానాశ్రయానికి చేరుకున్న ఉప రాష్ట్రపతి దంపతులకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ జితేందర్, ప్రొటోకాల్ జాయింట్ సెక్రటరీ ఎస్.వెంకట్రావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.నారాయణరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఇతర నాయకులు స్వాగతం పలికారు. ఇక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉపరాష్ట్రపతి దంపతులు కంది ఐఐటీకి బయలుదేరి వెళ్ళారు. సాయంత్రం ఉపరాష్ట్రపతి దంపతులు శంషాబాద్ విమానాశ్రయం చేరుకొని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు.

# టన్నెల్‌లో ఆగని నీటి ఊట

-తోడుతున్నకొద్దీ వస్తున్న నీరు
-రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకం
-మల్లెలతీర్థం, ఉసురువాగు, మల్లెవాగు నుంచి వస్తున్న నీరు
-జియోలాజికల్ సర్వేలో వెల్లడి



**నాగర్‌కర్నూల్, మార్చి 2 తరంగాలు**
ఎల్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో నీటి ఊట ఆగడమే లేదు. హెవీ మోటర్లతో తోడిపోస్తున్నా నిరంతరంగా నీరు ఊరుతూనే ఉన్నది. ఫలితంగా రెస్క్యూ బృందాల సహాయ చర్యలకు తీవ్ర ఆటంకంగా మారింది. టన్నెల్‌లో 8 మంది గల్లంతైన ఘటన జరిగి నేటికీ తొమ్మిది రోజులు అవుతున్నది. టన్నెల్‌లో కూలిన మట్టి శిథిలాల్లోనే మృతదేహాలు ఉన్నట్టు గుర్తించి నాలుగు రోజులవుతున్నది. నీటి ప్రవాహం వల్ల ఆ మృతదేహాలను బయటకు తీయడం సాధ్యంకావడం లేదు. ఈ నేపథ్యంలో జియోలాజికల్ అధికారులు రంగంలోకి దిగారు. నీరు వస్తున్న ప్రాంతా న్ని గుర్తించే పనిలోపడ్డారు.ప్రమాదం స్థలంలో పైభాగమైన అమ్రాబాద్ అటవీప్రాంతంలోని మల్లెలతీర్థం, తిర్మలాపూర్ సమీపం నుంచి ఈ నీటి ఊట వస్తుందని అధికారులు గుర్తించారు. ముందుగా ఆ నీటి ఊటకు అడ్డుకట్ట వేసేందుకు రంగంలోకి దిగారు. కృష్ణానది వైపుగా పెద్దమొత్తంలో వస్తున్న నీటి ప్రవాహం టన్నెల్‌లోకి పారుతుందని గుర్తించారు. ఈ నీటి ప్రవాహం ఎల్‌ఎల్‌బీసీ సొరంగం వైపు మళ్లడంతో టన్నెల్‌లో నీటి ప్రవాహం పెరిగి రెస్క్యూ టీమ్ పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుస్తున్నది.


# డోజ్ ఎఫెక్ట్..మస్క్‌కు షాక్

- టెస్లా కార్యాలయాల ఎదుట నిరసనలు
-టెస్లా కొనుగోళ్లు అడ్డుకోవాలని ఆందోళనకారుల పిలుపు
- ఇంగ్లండ్, స్పెయిన్, పోర్చుగల్‌లోనూ నిరసనలకు నిర్ణయం



**వాషింగ్టన్ తరంగాలు**
ప్రపంచంలో అత్యంత సంపన్నుడు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు మద్దతుదారుడు అయిన ఎలన్ మస్క్‌కి షాక్ తగిలింది. ఆయనకు వ్యతిరేకంగా అమెరికాలోని టెస్లా కార్యాలయాల ఎదుట ఆందోళనకారులు ఆదివారం భారీ నిరసన చేపట్టారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు అమెరికా అధ్యక్షులు ట్రంప్ నియమించిన డోజ్‌ని ఆందోళనకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉత్తరఅమెరికా, ఐరోపాలో ట్రంప్ విధ్వంసకర పాత్రకు పెరుగుతున్న వ్యతిరేకతకు ఈ ప్రదర్శనలు నిదర్శనం. దీనిలో భాగంగా టెస్లా కొనుగోళ్లను అడ్డుకోవాలని, ఆటంకం కలిగించాలని ఆందోళనకారులు భావిస్తున్నారు. శనివారం 50 కంటే ఎక్కువ ప్రదర్శనలు జరిగినట్టు టెస్లా వెబ్‌సైట్ పేర్కొన్నది. ఇంగ్లండ్, స్పెయిన్, పోర్చుగల్‌లతో పాటు యూఎస్‌లోని పలు ప్రాంతాల్లో మరిన్ని నిరసనలు చేపట్టనున్నట్టు ఆందోళనకారులు వివరించారు. టక్సన్, అరిజోనా సహా సెయింట్ లూయిస్, న్యూయార్క్ నగరం, డేటన్, ఒహి యోబీ షార్లెట్, పాలో ఆల్టో, కాలిఫోర్ని యాల్లో ఇటీవల ప్రదర్శనలు జరిగినట్టు వార్తానివేదికలు తెలిపాయి. కొంత మంది టెస్లా యజమానులు.. తమ వాహనాలను ధ్వంసం చేసినట్టు చెప్పారు. యూదు సమూ హాలు, పరిశీలకులు యూదు వ్యతిరేకత పెరుగు తుందని భయపడుతున్నారు. ఇటీవల ట్రంప్, మస్క్‌లు వేల సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగులను తొలగించడంతో పాటు ఒప్పందాలను రద్దు చేశారు. యూఎస్‌ఏజన్సీఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (యూఎస్‌ఎయిడ్) తో సహా ప్రభుత్వ విభాగాలను మూసివేశారు. మస్క్ చర్యలు అమెరికా బడ్జెట్‌ను నియంత్రిం చడానికి, తన సందపను పటిష్టపరుచుకోవడానికి మార్గాలను అందిస్తున్నాయనీ, కాంగ్రెస్‌ను ధిక్కరిస్తున్నాయని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మస్క్ ముఖ్యంగా స్పేస్‌ఎక్స్, సోషల్ మీడియా ఎక్స్‌లను విస్తరించేందకు యత్నిస్తున్నారని విమర్శిస్తున్నారు.

# గాజాస్ట్రిప్‌నకు సాయాన్ని అడ్డుకుంటాం



**ఇజ్రాయిల్**
గాజాస్ట్రిప్‌లోకి అన్ని రకాల సాయాన్ని, వస్తువుల ప్రవేశాన్ని అడ్డుకుంటామని ఇజ్రాయిల్ ప్రకటించింది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు కోసం ఇజ్రాయిల్ చేస్తున్న ప్రతిపాదనను హమాస్ అంగీకరించకపోతే 'తీవ్రమైన పరిణామాలు' ఉంటాయని హెచ్చరించిన సంగతి తెలిసిందే. సాయం పూర్తిగా నిలిచిపోయిందా లేదా అనేది తెలియాల్సి వుంది. రంజాన్ మరియు పాస్ ఓవర్ లేదా ఏప్రిల్ 20 వరకు కాల్పుల విరమణ మొదటి దశను పొడిగించే ప్రతిపాదనకు మద్దతు ఇస్తున్నట్టు ఇజ్రాయిల్ ఆదివారం తొలుత ప్రకటించింది. అమెరికా పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ నుంచి ఈ ప్రతిపాదన వచ్చినట్టు ఇజ్రాయిల్ తెలిపింది. ఇజ్రాయిల్-హమాస్ కాల్పుల విరమణ మొదటి దశలో.. మానవతా సాయం కొనసాగింది. అయితే ఈ ఒప్పందం శనివారంతో ముగిసింది. కాల్పుల విరమణ రెండవ దశపై చర్చలు జరగాల్సి వుంది. రెండోదశలో ఇజ్రాయిల్ సైన్యం ఉపసంహరణ, శాశ్వత కాల్పుల విరమణకు బదులుగా హమాస్ మిగిలిన బందీలను విడిచిపెట్టాల్సి వుంది. ఈ ఒప్పందం ప్రకారం.. హమాస్ మొదటి రోజు సగం బందీలను విడుదల చేయాల్సి వుందనీ, శాశ్వతకాల్పుల విరమణపై ఒప్పందం కుదిరిన తర్వాత మిగిలిన వారిని విడుదల చేయాల్సి వుందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ కార్యాలయం తెలిపింది. ఇజ్రాయిల్-హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ కోసం ఏడాది నుంచి మధ్యవర్తిత్వం వహిస్తున్న ఈజిప్టు, ఖతార్, అమెరికాలు ఈ ఒప్పందంపై వ్యాఖ్యానించాల్సి ఉంది. హమాస్ కూడా ఈ ప్రతిపాదనపై ఇప్పటికీ స్పందించలేదు.

# అనుకున్నదొకటి -అయ్యిందొకటి..!

- చిక్కుల్లో వీహెచ్
- అన్ని పార్టీల్లోని మున్నూరుకాపు నేతలతో భేటీ
- అధిష్టానం సీరియస్ కులగణనపై విమర్శల పట్ల అసహనం
-అర్థాంతరంగా ప్రెస్‌కాన్ఫరెన్స్ వాయిదా వేసుకున్న హన్మంతన్న



**తరంగాలు-హైదరాబాద్**
కాంగ్రెస్ పార్టీ లాయలిస్టు. గాంధీ కుటుంబానికి వీరవిధేయుడైన మాజీ ఎంపీ వి. హనుమంతరావు రాజకీయ చిక్కుల్లో ఇరుక్కున్నారు. అప్పుడప్పుడు పార్టీ గీసిన గీతను దాటుతుంటారు. ముఖ్యమంత్రి, మంత్రులపై కూడా ఆయన బహిరంగంగా విమర్శలు చేస్తుంటారు. ఈ కారణంగా ఎన్నో సార్లు పార్టీ నేతల నుంచి తీవ్రవిమర్శలు కూడా ఎదుర్కొన్నారు. వీటన్నింటిని లెక్క చేయకుండా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూనే ఉంటారు. అలాంటి హన్మంతన్న తాజాగా అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ నేపథ్యంలో ఆయన వివిధ పార్టీలకు చెందిన మున్నూరు కాపు సామాజిక తరగతికి చెందిన నాయకుల సమావేశాన్ని తన నివాసంలో ఏర్పాటు చేసినట్టు తెలిసింది. బీసీ కులగణనపై వారితో చర్చించడం ద్వారా పార్టీ ప్రతిష్టను పెంచాలనుకున్న ఆయనకు చేదు అనుభవమే ఎదురైంది. అనుకున్నదొకటి%ొ%అయ్యిందొకటి అన్నట్టు ఆయన ఏదో మంచి చేద్దామను కుంటే, సమావేశానికి వచ్చిన నేతలు బీసీ కులగణనను తప్పుపడుతూ తీవ్ర విమర్శలు చేసినట్టు తెలిసింది. దీంతో వీహెచ్‌పై అధిష్టానం సీరియస్ అయినట్టు సమాచారం. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మానస పుత్రిక అయిన బీసీ కులగణనను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసింది. దేశ వ్యాప్తంగా బీసీ కులగణనను అమలు చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టినట్టు పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణనలో బీసీల జనాభా తగ్గిదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ఊతమిచ్చేలా వీహెచ్ వ్యవహరించారని అధిష్టానం మందలిం చినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆదివారం గాంధీభవన్‌లో జరగాల్సిన ప్రెస్‌కాన్ఫరెన్స్‌ను ఆయన అర్థాంతరంగా వాయిదా వేసుకున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. ఈ సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ (మున్నూరుకాపు సామాజికతరగతి) ప్రతిపాదనతో కులగణన చేసినందుకు ప్రభుత్వం పట్ల కృతజ్ఞత సభ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే, కొంతమంది నేతలు కులగణన సరిగా జరగలేదనీ, తమ సంఖ్యను తగ్గించినట్లుగా అభిప్రాయపడ్డారు. ఇకపోతే ఈ సమావేశంపై ఏఐసీసీ ఆరా తీసింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఈ భేటీపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలను పిలిచి, ప్రభుత్వాన్ని విమర్శించడం ఏమిటని ప్రశ్నించినట్టు సమాచారం. బీసీ కులగణన చేసిన ప్రభుత్వాన్ని అభినందించాల్సిన పరిస్థితుల్లో, విమర్శించడం సరైంది కాదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించాల్సిన ఈ సమావేశానికి ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలను పిలవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో మున్నూరు కాపు నేతల అసంతృప్తి, కాంగ్రెస్‌లో అసహనం స్పష్టంగా కనిపించింది. ఈ సమావేశం తర్వాత

తరంగాలు Tharangalu Daily News Paper

# సంపాదకీయం

## దక్షిణాది మెడపై సీట్ల కోత కత్తి

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సరికొత్త ఆందోళనలకు దారితీస్తున్నది. రాజ్యాంగ బద్ధంగా జరగాల్సిన ఈ పునర్విభజన రాజకీయ విభజనగా మారడం ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వాల పుణ్యమే. దేశ భవిష్యత్తుకూ రాజకీయ గమనానికి సంబంధించిన కీలకాంశాలపై కూడా పారదర్శకంగా సమగ్రంగా చర్చ లేకుండా ఏకపక్ష నిర్ణయాలు రుద్దడం కేంద్ర ప్రభుత్వానికి పరిపాటిగా మారింది. ప్రతి అడుగులోనూ స్వప్రయోజనాల కోసం ప్రజాస్వామిక పద్ధతులకు తిలోదకాలిచ్చి అంతా గుప్పిట్లోకి తీసుకోవడం సర్కారు విధానంగా వుంది. రాష్ట్రాల హక్కులపై దాడి చేయడం, అంతకంతకూ అధ్యక్ష తరహాను తలపించే విధంగా కేంద్రీకృత పెత్తనానికి దారితీయడం దీని లక్షణంగా వుంది. అదే సమయంలో అంతా రాజ్యాంగబద్ధంగా పద్ధతి ప్రకారమే జరుగుతున్నట్టు నమ్మించడానికి చాలా ప్రయత్నాలు జరుగుతుంటాయి. నియోజకవర్గాల పునర్విభజన కూడా ఈ వలయంలో చిక్కి సరికొత్త సవాళ్లకు దారితీస్తున్నది. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కల తర్వాత జరగాల్సిన పునర్విభజన అనేక కారణాల వల్ల సందేహాస్పదమై పోయింది. దక్షిణాది రాష్ట్రాల స్థానాల సంఖ్య తగ్గిపోతుందనీ, ఒకవేళ పెంచినా వాటి వాటాగా రావలసిన పెరుగుదల రాదనీ ఈ ముఖ్యమంత్రులు విమర్శ చేస్తున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మార్చి 5న దీనిపై ఒక అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. దానిపై హోం మంత్రి అమిత్ షా ఎవరి సీట్లూ తగ్గబోవని ప్రకటించారు. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ హామీని విశ్వసించడానికి నిరాకరిస్తూ అసలు పునర్విభజన ఏ ప్రాతిపదికపై జరుగుతుందో చెప్పాలని గట్టిగా కోరారు. ఇది దక్షిణాదిపై బిజెపి, కేంద్ర ప్రభుత్వ రాజకీయ కుట్రగా ఆరోపించారు కూడా. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా అమిత్ షా హామీలను నమ్మలేమని వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాల నోరు నొక్కేందుకు పునర్విభజన అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్రానికి నిజంగా చిత్తశుద్ధి వుంటే ఈ పునర్విభజన ఏ ప్రాతిపదికన జరుగుతుంది, ఇప్పుడున్న సీట్లు ప్రస్తుత జనాభా ప్రకారమే వుంటాయా అని ఆయన ప్రశ్నించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ కూడా కేంద్రం అందరితో చర్చించి అడుగు వేయాలనీ, సందేహాలు తొలగించాలని వ్యాఖ్యానిం చారు. అయితే జమిలి ఎన్నికల బిల్లుతో సహా తను అనుకున్నవే చేసుకుపోయే మోడీ-షా ద్వయం తీరు తెలిసిందే గనక ప్రతిపక్షాలు తేలిగ్గా ఊరుకోవడానికి సిద్ధంగా లేవు.

### జనాభా సమస్య నేపథ్యం

సార్వత్రిక వయోజన ఓటింగు ప్రాతిపదికన నడిచే ప్రజాస్వామ్యం భారత రాజ్యాంగానికి పునాదిగా వుంది. అందుకు అనుగుణంగానే రాజ్యాంగంలోని 82వ అధికరణం ప్రకారం ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలు తీయడం, మార్పులు చేర్పులను బట్టి చట్టసభల నియోజకవర్గాల సంఖ్యలు, హద్దులు సవరణలు చేయడం జరగాల్సి వుంటుంది. ఎందుకంటే జనాభా అధికంగా వున్నా తక్కువగా వున్నా అన్ని రాష్ట్రాలలోనూ ఓటుకు ఒకే విలువ వుండాలి. ఇతర ప్రభావాలున్నా 1976 వరకూ అలా జరిగింది. ఎమర్జన్సీలో తెచ్చిన 42వ రాజ్యాంగ సవరణలో నియోజకవర్గాల పునర్విభజన స్తంభింపచేశారు. ఆ సమయంలోనే జనాభా నియంత్రణపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టారు. జనాభాను తగ్గించే చర్యల కోసం రాష్ట్రాలను ప్రోత్సహించారు. అప్పటికి దక్షిణాది రాష్ట్రాలలో 6 నుంచి 10 శాతం పెరుగుదల వుంటే ఉత్తరాదిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, యు.పి, బీహార్ లలో 12 నుంచి 15 శాతం వుండింది. కనుక జనాభా నియంత్రణ చర్యలు వేగవంతం చేయాలనీ ఇరవయ్యేళ్ల తర్వాతనే పునర్విభజన చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమయంలో జనాభా తగ్గితే సీట్లు తగ్గించడం సరికాదు గనక పార్లమెంటు స్థానాల సంఖ్యను 2001 వరకూ స్తంభింపచేశారు. కనుకనే సీట్ల స్వరూపంలో అనేక మార్పులు జరిగినా మొత్తం సంఖ్యలో మార్పు రాలేదు. సరిహద్దుల మార్పు తప్ప ఆ యా రాష్ట్రాల వారీగా వున్న సీట్ల సంఖ్యలో మార్పు లేకుండా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను 2026 వరకూ వాయిదా వేస్తూ 2002 రాజ్యాంగ సవరణ చట్టం తీసుకొచ్చారు. ఈలోగా రాష్ట్రాల వారీగా అందులోనూ ఉత్తర దక్షిణ భారతీయ జనాభాలో హెచ్చుతగ్గుల తేడాలు సమస్యకు దారితీశాయి. 1976 తర్వాత కాలంలో దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తర్వాత ఎ.పి, తెలంగాణలు జనాభా తగ్గింపులో గణనీయమైన ముందంజ వేశాయి. తమిళనాడులో సంతానోత్పత్తి రేటు 2001 నాటికే 2.0గా వుంది. అంటే జనాభా స్థిరీకరణ దశకు చేరింద ని అంచనా వేశారు. అదే బీహార్, యు.పి లను తీసుకుంటే 2015లో కూడా వాటి జనాభా పెరుగుదల రేటు 4.0గా వుంది. ఇతర మానవాభివృద్ధి సూచికల్లోనూ దక్షిణాది రాష్ట్రాలు కొంత మెరుగ్గా వున్నాయి. 2011-2021 మధ్య వీటి మధ్య జనాభా తేడాలలో సమత్వం రాలేదని మాజీ ఎన్నికల ప్రధానాధికారి ఓ.పి.రావత్ ఒక సందర్భంలో చెప్పారు. ఫలితంగా హిందీ రాష్ట్రాలు మరింత ముఖ్యంగా పెద్దవైన ఉత్తర ప్రదేశ్, బీహార్‌ల జనాభా మాత్రం తగ్గకపోగా పెరుగుతూనే వచ్చింది. జనాభా నియంత్రణ చర్యలలో నిర్లక్ష్యం, మత సంబంధాలతో సహా అనేక రాజకీయ కారణాలు దీని వెనక వున్నాయనేది స్పష్టం. ఉన్న చట్టం ప్రకారం ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన ఎజెండాలోకి రానుంది.

### రెండు విధాల అన్యాయం

అమిత్ షా ప్రకటనను బట్టి చూస్తే 2026లో ఈ ప్రక్రియ చేపట్టడం తథ్యంగా కనిపిస్తుంది. అయితే ఇప్పుడు కేవలం జనాభాను బట్టి సీట్లు నిర్ణయించేట్టయితే తక్కువ జనాభా వున్న దక్షిణాదిన సీట్లు తగ్గితే ఇప్పటికే చాలా ఎక్కువగా వున్న యు.పి, బీహార్ వంటి వాటికి ఇంకా పెరుగుతాయి. సగటు జనాభాను చూస్తే వేరే తేడాలుంటాయి. ఉదాహరణకు నాలుగు కోట్ల జనాభా వున్న తెలంగాణకు 17 లోక్‌సభ సీట్లున్నాయి. 12.6 కోట్ల జనాభా వున్న బీహార్‌కు 40 సీట్లున్నాయి. సగటున తెలంగాణకు 23 లక్షల మందికి ఒక సీటు వుంటే బీహార్‌లో సగటున 32 లక్షల మందికి ఒక సీటు వున్నట్టు లెక్క. అందులోనూ జనాభాను బట్టి దామాషా ప్రాతిపదికన పెంచేట్టయితే ఆ ఫార్ములాను బట్టి ఈ తేడా ఇంకా విపరీతంగా మారొచ్చు.

## రేవంత్ ఒంటరి పోరు!

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి రోజులు వస్తున్నట్టున్నాయి. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా మీనాక్షి నటరాజన్‌ను పార్టీ అధిష్ఠానం నియమించడమే ఇందుకు నిదర్శనం. గతంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఎలా వ్యవహరించారో చూశాం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇన్‌చార్జిలుగా వ్యవహరించినవారు పార్టీ శ్రేయస్సును పట్టించుకోకుండా స్వప్రయోజనాలనే చూసుకున్నారు. నిన్నటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న దీపాదాస్ మున్షీ కూడా ఇందుకు భిన్నం కాదు. తమను సంతృప్తిపరచిన వారికి అనుకూలంగా అధిష్ఠానానికి నివేదికలు పంపేవారు. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇన్‌చార్జిగా ఉండిన గులాంనబీ అజాద్‌కు భారీగా ముడుపులు అందేవన్నది బహిరంగ రహస్యం. ఇలాంటి వారివల్ల బలమైన నాయకులు తెరమరుగయ్యారు. అంతిమంగా అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడింది. ఇంతకాలానికి కాంగ్రెస్ అధిష్ఠానం అసలు సిసలైన గాంధేయవాదాన్ని నమ్ముకొని ఆచరిస్తున్న మీనాక్షి నటరాజన్‌ను తెలంగాణ ఇన్‌చార్జిగా నియమించింది. కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికి కూడా మీనాక్షి వంటి వారు ఉన్నారని నిన్నటి వరకు మనకు తెలియదు. ఆమె గురించి మీడియాలో వచ్చిన కథనాలు ఆశ్చర్యం కలిగించాయి. చోటా మోటా నాయకులు కూడా రైలు ప్రయాణాలను మరచిపోయిన ఈ రోజుల్లో రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమితురాలైన తర్వాత తొలిసారిగా ఢిల్లీ నుంచి హైదరాబాద్ రైలులో ప్రయాణించిన మీనాక్షి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఫైవ్ స్టార్ హోటళ్లలో మాత్రమే బస చేయడం తెలిసిన గత ఇన్‌చార్జిలకు భిన్నంగా ఆమె ప్రభుత్వ అతిథి గృహంలో రోజుకు 50 రూపాయలు చెల్లించి బసచేస్తున్నారు. సన్మానాలు, బొకేలు, ఫ్లెక్సీల సంస్కృతి కూడా తన ఒంటికి పడదని ఆమె రాష్ట్ర నాయకుల ముఖం మీదే చెప్పారు. దీంతో శుక్రవారం నాడు గాంధీభవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగినా హడావిడి, ఆర్భాటం కనిపించలేదు. ఈ నేపథ్యంలో గాడి తప్పుతున్న కాంగ్రెస్ పార్టీని మీనాక్షి గాడిలో పెట్టగలరన్న నమ్మకం కలుగుతోంది. పార్టీకి ఉపయోగపడేవారు ఎవరు? పార్టీని ఉపయోగించుకొనేవారు ఎవరు? అన్నది అనతి కాలంలోనే ఆమె గుర్తించగలరని ఆశించవచ్చు. నిరాడంబరంగా ఉండటమే కాకుండా పార్టీ శ్రేయస్సు మాత్రమే మీనాక్షికి ముఖ్యమని స్పష్టమవుతున్నందున క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తూ ఆమె అధిష్ఠానానికి నివేదికలు పంపుతారని నమ్మవచ్చు. ప్రస్తుతానికి కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒంటరి పోరు చేస్తున్నారు. పార్టీ నాయకులు తనకు అండగా నిలవడం లేదని రేవంత్‌రెడ్డి తన మనసులోని ఆవేదనను పరోక్షంగా బయటపెట్టారు. మంచి మాటను మైక్‌లో చెప్పాలి, చెడును చెవిలో చెప్పాలి అని గుర్తు చేయడం ద్వారా రాష్ట్ర కాంగ్రెస్‌లో ఏం జరుగుతోందో చెప్పకనే చెప్పారు. ముఖ్యమంత్రిగా తాను అనుకున్నట్టుగా పని చేయలేకపోతున్నానన్న అసంతృప్తి తనకు ఉందని కూడా ఆయన తెలిపారు. గత పదిహేను మాసాలలో ప్రభుత్వం ఎన్నో చేసినా... వాటి గురించి మాట్లాడకుండా లోపాలను ఎత్తిచూపుతున్నారని కూడా




రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే ఈ లోపం ఉంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన వాటి గురించి పార్టీ నాయకులు పెద్దగా ప్రచారం చేసుకోరు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మాత్రం ఇందుకు విరుద్ధంగా పార్టీ నాయకులు అందరూ ఆయనను మోశారు. ఫలితంగానే ఆయన రెండో పర్యాయం ముఖ్యమంత్రి అయ్యారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకుంది. చట్టాలు చేసింది. ఉపాధి హామీ పథకం, భూ సేకరణ చట్టం, విద్యా హక్కు చట్టాలు యూపీఏ ప్రభుత్వం హయాంలో వచ్చినవే. ఉపాధి హామీ పథకం వల్ల దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రయోజనం పొందుతున్నారు. కానీ, కాంగ్రెస్ నాయకులు ఆ పథకం తాము తెచ్చిందే అని ప్రచారం చేసుకోరు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నాడు గాంధీభవన్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో తన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ఏకరువు పెట్టారు. అవన్నీ వింటున్నప్పుడు నిజంగా ఇన్ని నిర్ణయాలు తీసుకున్నారా అని ఆశ్చర్యం వేసింది. అయినా, అనుభవం లేనందున ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి విఫలమవుతున్నారన్న ప్రచారమే పెరిగింది. ఈ ప్రచారమే అంతిమంగా కాంగ్రెస్ పార్టీకి కీడు చేస్తుంది. ఇప్పుడు ప్రలోభాలకు లొంగని మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా వచ్చినందున పరిస్థితిలో మార్పు రావచ్చు.

### మీనాక్షి కర్తవ్యం...

తెలంగాణలో మంత్రుల నుంచి కింది స్థాయి కార్యకర్తల వరకు ఎవరు ఏమిటి? ప్రజల్లో ఎవరికి బలముంది? పార్టీకి ఉపయోగపడేది ఎవరు? పార్టీకి గుదిబండలుగా మారుతున్నది ఎవరు? ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డికి స్వేచ్ఛను ఇవ్వడం అవసరమా? లేదా? వంటి విషయాలను మీనాక్షి ముందుగా అధ్యయనం చేయాలి. రాహుల్‌గాంధీకి ఆమె నమ్మకమైన వ్యక్తి కనుక మీనాక్షి ఇచ్చే నివేదికలకు విలువ ఉండవచ్చు. పనిలో పనిగా ప్రభుత్వంపై ప్రజాభిప్రాయం తెలుసుకోవడానికి నూతన ఇన్‌చార్జి ప్రయత్నించాలి. నిష్పాక్షికంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మార్గదర్శనం చేస్తే పార్టీ పరిస్థితి మెరుగుపడవచ్చు. మంత్రులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పట్టులేదన్న అభిప్రాయం విస్తృతంగా ఉంది. ఈ అభిప్రాయాన్ని పోగొట్టేందుకు ఆమె కృషి చేయాలి. ముఖ్యమంత్రికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పుడే వారు సమర్థులో కాదో స్పష్టమవుతుంది. కొన్ని మంత్రిత్వ శాఖల్లో జోక్యం చేసుకోకూడదని ముఖ్యమంత్రిపై ఆంక్షలు పెట్టడం ఏమిటి? కాంగ్రెస్ అధిష్ఠానం చేసిన అతి పెద్ద తప్పు ఇది. ప్రజల్లో, పార్టీ శాసనసభ్యుల్లో ఎవరికి పరపతి ఉంది? ఎవరిని ఎంత వరకు ప్రోత్సహించాలి? అనే విషయమై మీనాక్షి నటరాజన్ అవగాహన ఏర్పరుచుకోవాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నాడు తన మనసులోని ఆవేదనను బయటపెట్టుకున్నారు. నిజానికి గత కొంత కాలంగా రేవంత్‌రెడ్డి సంతోషంగా లేరు. కాళ్లూ చేతులూ కట్టేసి ఈదమన్నట్టుగా తన పరిస్థితి ఉందని ఆయన కొంత మంది వద్ద ఆవేదన కూడా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని నడపడమే కాదు%-% ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పైన ఉంటుంది. ఇందుకోసం ఆయనకు తగినంత స్వేచ్ఛ ఇచ్చి చూడాలి. మీనాక్షి నటరాజన్ కార్యకర్త స్థాయి నుంచి వచ్చినందున క్షేత్ర స్థాయి పర్యటనలు జరిపి ప్రజాభిప్రాయంతోపాటు కార్యకర్తల అభిప్రాయాలూ తెలుసుకునే కార్యక్రమానికి వెంటనే శ్రీకారం చుట్టాలి. మీనాక్షి మార్గదర్శకంలో రాష్ట్ర కాంగ్రెస్‌కు కాయకల్ప చికిత్స వెంటనే ప్రారంభమవ్వాలి. ఈ ఏడాది చివరి నాటికి ప్రభుత్వ ప్రతిష్ఠను ఇనుమడింపజేయడానికి కృషి జరగని పక్షంలో ప్రతిపక్షాలు బలపడతాయి. రేవంత్‌రెడ్డి అరమరికలు లేకుండా మీనాక్షి నటరాజన్‌తో చర్చలు జరపాలి. ప్రభుత్వాన్ని మరింత సమర్థంగా నడుపుతూ ప్రజల మన్ననలు చూరగొనడానికి తన వద్ద ఉన్న ప్రణాళికలను ఆమెకు వివరించి, ఆ క్రమంలో తనకు ఏ మేరకు స్వేచ్ఛ అవసరమో చెప్పుకోవాలి. కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ఆమెకు పరపతి, విశ్వసనీయత ఉన్నందున ముఖ్యమంత్రికి ఆమె అండగా నిలబడవచ్చు. అదే జరిగితే ఇటు రేవంత్‌రెడ్డికి, అటు కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయి. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక నాయకురాలి గురించి నాలుగు మంచి మాటలు చెప్పుకొనే అవకాశం ఇంత కాలానికి లభించింది. ఇందుకు పార్టీ అధిష్ఠానాన్ని అభినందించాల్సిందే!

### 'తమ్ముళ్లూ'... తొందరొద్దు!

ఇప్పుడు ఆంధ్ర రాజకీయాలకు వద్దాం! రాష్ట్ర శ్రేయస్సు, ప్రజాహితాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్డీయే కూటమి ఐక్యంగానే ఉంటుందని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి కనీసం మరో పదిహేనేళ్లు అధికారంలో కొనసాగుతామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శాసనసభ సాక్షిగా ప్రకటించారు. దగాపడ్డ ప్రజలకోసం తాము కూటమిగా ఏర్పడ్డామని ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా చెప్పారు. రాష్ట్రం హితవు కోరేవారు ఈ ఇరువురి ప్రకటనలను కచ్చితంగా స్వాగతిస్తారు.

## మూఢనమ్మకాలు పెంచుతున్న మాధ్యమాలు

శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచం దూసుకుపోతున్నది. అందులో భాగమే టీవి చానళ్లు, పత్రికలూ. ఎప్పటికపుడు వార్తలు అందించేదానికి, ప్రజలను చైతన్యం చేసేందుకు పత్రికలూ రేడియోలు, టీవి చానళ్లు ఏర్పడ్డాయి. అయితే ఆ బాధ్యతను మరిచి ప్రజలను మూరు?లుగాను, మూఢనమ్మకాలలో మునిగిపోయే విధంగాను పనిచేసేవి పెరిగాయి. టీవి, రేడియో, చానళ్లు పెడితే చాలు. శుక్లాం భరధరాలు, సుప్రభాత శృంగారాలు, జాతకాలు, వాస్తూ సంఖ్యాశాస్త్రాలు, భక్తి. ఇవి తప్ప వేరేవేవీ లేనట్లుగా ప్రసారం చేస్తున్నాయి. దొంగబాబాలు, బాబాల ప్రవచనాలు ప్రసారం చేయటంలో ముందుంటున్నాయి. పేరు మార్చుకుంటే జీవితాలు బాగుపడతాయంటూ కొంతమంది, మేమిచ్చిన రుద్రాక్షలు ధరిస్తే కోటీశ్వరులౌతారని, రంగురాళ్లకు మహత్యముందని వేళ్ళకు రంగురాళ్లు ధరించమనీ శాస్త్రీయ జ్ఞానం ద్వారా కనుగొన్న ప్రసార సాధనాలు ప్రజలను అజ్ఞానంలో ముంచుతున్నాయి. అంతేకాదు. వందడుగులైనా, రెండొందల అడుగులైనా విగ్రహాలను మనిషి తయారు చెయ్యాల్సిందే. వాటికి ఏదో మహిమలున్నట్లు పూజారివర్గం ప్రచారం.




ఎటుపోతున్నాం మనం? కొన్ని టీవి ఛానళ్ళ వారు ఇంకొంచం ముందుకుపొయ్యి వారే భక్తి పెంచేందుకు 'భక్తి' చానళ్లను మొదలు పెడుతున్నారు. శాస్త్రీయ ఆలోచనను చంపేందుకు కంకణం కట్టుకున్నారా ఏంటి? అందుకే వీటికి అనుమతులు ఇవ్వకూడదు. సైన్సును పెంచేవాటికే అనుమతులు ఇవ్వాలి. డబ్బుందికదాని ప్రజలను చైతన్యరహితులుగా చెయ్యకూడదు. ప్రభుత్వం కూడా అలోచించాలి. రాజ్యాంగం అర్టికల్ 51ఎ (హెచ్)లో రాసుకున్న సూత్రాలను అమలుపరచేవిధంగా ఉండాలి. కనుక భక్తి చానళ్లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకూడదు.

# మండుతున్న ఎండలు ఎండిపోతున్న పంట పొలాలు

**-ఎండిన పంటలకు ఎకరాకు 50 వేలు ఇవ్వాలి**

**-తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య**



**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 02,(తరంగాలు):** మండుతున్న ఎండలకు ఎండిపోతున్న పంట పొలాలకు వెంటనే నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. ఎండిపోతున్న పంట పొలాలను మండలంలోని తమ్మడపల్లి జి గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రైతు రాపర్తి సోమయ్య పంట పొలాలను పరిశీలించడం జరిగింది. వారు మాట్లాడుతూ ఎండిపోతున్న పంట పొలాలకు ప్రభుత్వం వెంటనే కాలువల ద్వారా నిరందించి ఆదుకోవాలని అన్నారు. లేనిపక్షంలో ఎండిన పంట పొలాలకు ఎకరాకు 50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.గోదావరి జలాలతో మండలంలోని చెరువులు కుంటలు నింపి రైతుల పంట పొలాలకు నిరంధించాలన్నారు. చెరువులలో నీరు తగ్గడంతో సాగునీరు సక్రమంగా అందకపోవడంతో, బోరు బావులు వెండి రైతులకు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరి పొలాలకు సక్రమంగా తడులు అందక ఎండిపోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సాధ్యమైన వరకు కాలువల ధర నిరంధించి రైతు పంట పొలాలను ఆదుకోవాలని అన్నారు. ఎండిన పంట పొలాలకు ఎకరాకు 50 వేల చొప్పున రైతులకు నష్టపరిహారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, ఎండి షబానా,వేల్పుల చిన్న రాములు ,,పెద్ద రాములు, వేల్పుల రవి, గంగరాజు, నాగరాజు, వడ్లకొండ సుధాకర్ రాజు, చంద్రు నరసయ్య, శంషొద్దీన్ ,గుండెబోయిన రాజు, నక్క అజయ్ ,తదితరులు పాల్గొన్నారు

# నూతన జంటను ఆశీర్వదించిన పలువురు




**జఫర్గడ్ ప్రతినిధి, మార్చ్ 02,(తరంగాలు):** మండలం లోని సురారం గ్రామంలో జరిగిన యాతం నర్సింహులు కుతూరు వివాహా శుభ కార్యానికి హాజరయి నూతన జంటను ఆశీర్వదించిన జఫర్గడ్ పాక్స్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, జఫర్గడ్ మాజీ ఎంపీపీలు రడపాక సుదర్శన్, గాదెపాక అయోధ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అన్నెపు అశోక్, కాటం రాజిరెడ్డి, ఇల్లందుల శ్రీనివాస్ . ఈ కార్యక్రమంలో కూరపాటి విజయ్ కుమార్, దాసరి నాగరాజు, రాపర్తి రాజ్ కుమార్, నక్క ప్రభాకర్, శాగ రాజు, కుటుంబ సభ్యులు, బందు మిత్రులు పాల్గొన్నారు.

# వివాహాది శుభకార్యాలకు హాజరైన పెద్ది







**నర్సంపేట ఫిబ్రవరి 02 తరంగాలు:** నర్సంపేట నియోజకవర్గం లో ఆదివారం జరిగిన పలు వివాహాది శుభకార్యాలకు మరియు నూతన గృహప్రవేశాలకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరైనారు. ఖానాపురం మాజీ ఎంపీపీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు సావిత్రి దంపతుల కుమార్తె సాయి రసజ్ఞ అఖిల్ దంపతుల వివాహ వేడుకకు పెద్ది సుదర్శన్ రెడ్డి మాజీ పార్లమెంటు సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ తో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నల్లబెల్లి మండలం మామిండ్ల వీరయ్య పల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు యారా రవి అనురాధ దంపతుల కూతురు సుచిత్ర ప్రశాంత్ వివాహ వేడుకకు పెద్ది హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పంతులు పల్లె గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏడాకుల రాజిరెడ్డి కవిత దంపతుల నూతన గృహప్రవేశం కార్యక్రమానికి పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరైనారు. రంగాపురం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాపర్తి సునీత సంపత్ ల కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పై కార్యక్రమాలకు ములుగు జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ రావు, ఓ డి సి ఎం ఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, నియోజకవర్గస్థాయి నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు మరియు గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ వెంటనే చేపట్టాలి

**తెలంగాణా జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఎండీ షానూర్ బాబా డిమాండ్**



**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు పేరుకు మాత్రమే ఇండ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పంపిణీకి నోచుకోకపోవడం చాలా బాధాకరం అన్నారు. ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తూ పంపిణికి శ్రీకారం చుట్టాలన్నారు. ఇందిరమ్మ గృహ పథకం కింద జర్నలిస్టులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ గుండాల మండల అధ్యక్షులు సూరారపు నరేష్, ప్రధాన కార్యదర్శి సుదగాని హరికృష్ణ గౌడ్, మండల కార్యవర్గ సభ్యులు పగడాల అంబదాస్ నేత, తదితరులు పాల్గొన్నారు.

# కాటేపల్లి-చాడ ముత్తిరెడ్డిగూడెం మధ్యలోని రోడ్డుకు మోక్షం ఎప్పుడో?





**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటాకొండూర్ మండల పరిధిలోని కాటేపల్లి-చాడ ముత్తిరెడ్డిగూడెముల మధ్యలో ఆగిపోయిన తారురోడ్డుకు మోక్షం ఎప్పుడో అంటున్న ప్రయాణికులు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు మొదలైన రోడ్డు పనులు ఐదు సంవత్సరాలు పూర్తైన పూర్తిచేయాలని అప్పటి ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేకపోవడంతో పూర్తి చేయలేకపోయింది అని ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తున్న ప్రయాణికులు, వాహనదారులు అంటున్నారు.కనీస ఇప్పుడు ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు సంవత్సరం పూర్తై రెండు సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా నైన పూర్తి చేస్తారా అని అంటున్న ప్రయాణికులు, వాహనదారులు, భారీ వాహనాలు ప్రయాణిస్తున్న సమయంలో ప్రక్కనుండీ ప్రయాణికులు,చిన్న వాహనాలు ప్రయాణించాలంటే ఏ కంకర రాయి వచ్చి ఎక్కడ తాకుతుందో అని భయంతో ప్రయాణించాల్సివస్తుంది అంటున్న ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తున్న ప్రయాణికులు, చిన్న వాహనాలు తోలేవారు భయపడుతూ వెళ్తున్నమని అంటున్నారు. స్థానిక ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అయినా ఈ ఎండకాలం పూర్తైయేలోపు పూర్తిచేయించాలని ప్రయాణికులు ప్రజలు కోరుతున్నారు. నిత్యం ఈ రోడ్డు మీదుగా తనిఖీ కార్యక్రమాలకు కోసం ప్రయాణిస్తున్న జిల్లా అధికారులకైన కన్పించటంలేదా!అంటున్న కాటేపల్లి-ముత్తిరెడ్డిగూడెం గ్రామాల ప్రజలు.ప్రజాసేవకులైన ఆలేరు ఎమ్మెల్యే నైనా ఈ రోడ్డు మీదుగా ప్రయాణిస్తున్న ప్రయాణికులు,చిన్న తరహ వాహనదారుల ప్రాణాలను కాపాడటం కోసమైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తారురోడ్డును పూర్తి చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు,పరిసర ప్రాంతాలు ప్రజలు కోరుతున్నారు.

# పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు సమయం మార్పు చేయాలి ఒక మతానికి కొమ్ముకాస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో రద్దు చేసుకోవాలి

**-బీజేవైఎం**




**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో ఆదివారం రోజు భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినాలను పురస్కరించుకుని ఈనెల 6 నుండి నిర్వహించే పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను మధ్యాహ్నం 12.15 నుండి 3.15 గంటలకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సమంజసం కాదు. ఆ సమయంలో విద్యార్థులు, అధ్యాపకులు సహా ప్రతి ఒక్కరూ లంచ్ చేసే సమయం. ఈ సమయంలో పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. రంజాన్ సందర్భంగా ముస్లింలకు సాయంత్రం 4 గంటల తరువాత విధుల నుండి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. పాఠశాలల వేళలు సైతం ఉదయం 9.15 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.15 గంటలకు ముగుస్తాయి. అయినప్పటికీ మళ్లీ రంజాన్ పేరుతో వేళాపాళా లేకుండా పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసం? ఒక వర్గం వారిని మెప్పించేందుకు యావత్ విద్యార్థుల కడుపు మాడ్చడం న్యాయమా ? తబ్లిగీ జమాతే వంటి విదేశాల్లో నిషేధిత సంస్థ మన రాష్ట్రంలో సభలు నిర్వహించుకుంటే ఏకంగా ప్రభుత్వ సొమ్మును ఖర్చు చేస్తున్నారు. రంజాన్ కు డ్యూటీ మినహాయింపు ఇస్తున్నారు. రంజాన్ కు బహుమతులు అందిస్తారు. మక్కా వెళ్లేందుకు ఉచిత వసతి, రవాణా సదుపాయాలు కల్పిస్తారు. కానీ అయ్యప్ప, భవానీ, హనుమాన్ భక్తులకు మాత్రం ఎలాంటి మినహాయింపులూ ఇవ్వడం లేదు. హిందూ పండుగలకు ప్రత్యేక నిధులూ కేటాయించరు. శివరాత్రి పండుగ సందర్భంగా హిందువులంతా ఉపవాసం, జాగరణ చేస్తారు. మరుసటి రోజు విశ్రాంతి తీసుకుంటారు. కనీసం అప్షనల్ హాలీడే కూడా ఇవ్వలేదు. పైగా హిందూ పండుగల సమయంలో నిబంధనల పేరుతో అనేక అడ్డంకులు సృష్టిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిలో ఇదేనా సమానత్వమంటే ?హిందువులంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి అంత చులకనా ?కాంగ్రెస్ తీరు తీవ్ర అభ్యంతరకం. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ ను ఉపసంహరించుకోవాలి. విద్యార్థులకు, అధ్యాపకులకు ఇబ్బంది లేకుండా 10వ తరగతి ప్రీఫైనల్ పరీక్షా టైం టేబుల్ ను మార్చాలని కోరుతున్నాం.లేని పక్షములో బీజేవైఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల పార్టీ అధ్యక్షులు పైళ్ల ప్రశాంత్ జనరల్ సెక్రెటరీ లోడి మహేష్ , మధు, సాయి, నరేష్, అమర్, తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపిన..

**-ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ ఛైర్పర్సన్ విద్యా వేత్త జయ లక్ష్మి**



**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** ప్రేసిడెన్సి గ్రూప్ ఆఫ్ చైర్పర్సన్ ప్రముఖ విద్యా వేత్త తీగల జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థులకు ఎక్సలెన్సి అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు విద్యార్థి తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యపాటు సాంస్కృతిక కళా వివిధ రంగాల వైపు విద్యార్థులను ప్రోత్సహిస్తూ తనదైన శైలిలో విద్యార్థులను తీర్చిదిద్దడమే మా యొక్క పాఠశాల సంకల్పమని తెలిపారు. మార్చిలో జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో జిల్లాలో ప్రథమ స్థానం ఉంచేందుకు ప్రణాళిక బద్ధమైన కార్యాచరణను చేస్తున్నమని తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలి తప్ప కష్టపడి ఒత్తిడితో చదవకూడదని తెలిపారు. భవిష్యత్తులో జిల్లాలో అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో ఉంచేందుకు తన వంతు కృషి చేస్తానని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అవెజ్,మరియు వివిధ పార్టీల నాయకులకు విద్యార్థుల తల్లిదండ్రులకు మా శ్రేయోభిలాషులకు మా అభిమానులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## మృతురాలి కుటుంబ సభ్యులకు
# ఆర్థిక సహాయం అందచేత

**కేహెచ్చ్ఆర్ ఫౌండేషన్ సహకారంతో తాజామాజీ సర్పంచ్ గనగాని మాధవి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో అందచేత**



**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూరు(ఎం)మండలం, పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బండారు వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేహెచ్చ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హారదీప్ రెడ్డి సహకారంతో తాజా మాజీ సర్పంచ్ గనగాని మాధవి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో 10,000/-ల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగుల యయాతి రాజు, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నాగుల యాదగిరి, మరియు కోలా ఐలయ్య, ఎర్ర వెంకటరెడ్డి, కడకంచి బీరయ్య, కోల రమేష్, కన్నెబోయిన రాజు, ఎర్ర ఎలేందర్ రెడ్డి, కోలా ముత్యం, తాళ్ల పెల్లి రాములు, కోల కృష్ణమూర్తి, మక్తల శ్రీశైలం, మక్తల రమేష్,ఎల్లబోయిన నరసయ్య, ఎల్లబోయిన యాదయ్య, ఎల్లబోయిన ఎల్లయ్య, కన్నబోయిన ఐలయ్య, ఇంద్రాల ఎల్లయ్య, ఏనుతల జాంగిర్, తదితరులు పాల్గొన్నారు.


# రామారంలో కిషోర్ హెయిర్ సెలూన్ ప్రారంభం

**ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి గౌడ్**



**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారం గ్రామంలో మాసాన్ పల్లి గ్రామానికి చెందిన యువకుడు మరిపల్లి కిషోర్ హెయిర్ సెలూన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై హెయిర్ సెలూన్ ని ప్రారంభించిన ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసరపు యాదగిరి గౌడ్. ఈ కార్యక్రమంలో గుండాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలూరి రాంరెడ్డి, మాసన్ పల్లి మాజీ సర్పంచ్ కేమిడి సోమన్న, రవి కుమార్, కొండల్ రెడ్డి,వెంకటయ్య, మండల యూత్ అధ్యక్షులు మదూరి నరేష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు,యూత్ నాయకులు మరియు పెద్ద ఎత్తున పాల్గొన్న గ్రామస్తులు.

## నవీన్ గౌడ్ చెల్లి వివాహనికి హాజరైన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి



**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం సోలిపేట్ గ్రామ తాజామాజీ సర్పంచ్ నవీన్ గౌడ్ చెల్లి వివాహమహోత్సవం వేడుకలలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రా రెడ్డి మరియు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు.

## ఆకర్షిస్తున్న ఐదు ఫీట్ల భారీ పొట్లకాయ



**గణపురం, మార్చి 02 తరంగాలు:** గణపురం మండలంలోని నగరంపల్లి గ్రామంలో ఐదు అడుగుల పొట్లకాయ అందర్నీ ఆకర్షిస్తుంది. నగరంపల్లి గ్రామానికి చెందిన ముప్పిడి రవీందర్ రెడ్డి ఇంటి ఆవరణలో మొలచిన పొట్ల చెట్టుకు భారీగా ఐదడుగుల ఎత్తులో పొట్లకాయ పెరిగి అందర్నీ ఆకర్షిస్తుంది. దీంతో గ్రామంలోని ప్రజలు పొట్ట కాయను చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పొట్లకాయ భారీగా పెరగడంతో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పొట్లకాయను చూసేందుకు తరలివస్తున్నారు.

# గొల్లగూడెంలో ఓంకార్ ఆశ్రమం ప్రారంభం

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్**





**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో మాజీ ఎంపిపి బబ్బూరి రవీందర్ ఓంకార్ ఆశ్రమం ప్రారంభ కార్యక్రమంలో ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్య గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిక్షమయ్య గౌడ్ ని శాలువాతో సన్మానించిన ఆశ్రమం యాజమాని బబ్బూరి రవీందర్. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇటీవల మృతి చెందిన కుండే కిష్టయ్య కుటుంబానికి 50కిలోల బియ్యం అందచేత



**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం సాయిగూడెం గ్రామంలో ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాల స్ఫూర్తి మేరకు బయ్యా జ్ఞానేందర్ సహాయంతో ఇటీవల సాయిగూడెం గ్రామ నివాసి కుండే కిష్టయ్య ప్రమదవషాతు మరణించడం జరిగింది.వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకాయల శ్రీను, భీమగాని ప్రభు, దంతూరి వెంకటేష్, గంగాధరి ఉపేందర్, కుండే కుమార్, బొడ్డు చందు అంగడి ప్రవీణ్, బీమాగాణి సాయిరాం, సంగి అనిల్, ముద్దేపాక వరప్రసాద్, పుట్ట సాయి తరుణ్, గ్రామస్తులు కుండే మల్లేష్, మధు,తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్టు చెస్ క్యారమ్ విజేతలకు ఎస్ ఆర్ కళాశాలలో బహుమతులు ప్రధానం




**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలో భజరంగ్ యూత్ వారి ఆధ్వర్యంలో గత వారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్,చెస్ మరియు క్యారమ్ విజేతలకు స్థానిక ఎస్ ఆర్ కళాశాలలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆలేరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం ఏ ఎజాజ్,ఆలేరు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ ,ఎస్ ఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ రమేష్ పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్ లో మొదటి బహుమతి ఎం అక్షిత ఏకశిల పబ్లిక్ స్కూల్,రెండవ బహుమతి వగ్గు సుశాంత్ ప్రగతి హై స్కూల్, తృతీయ బహుమతి ఏ ఆర్యన్ ఏకశిల పబ్లిక్ స్కూల్ మరియు ఇతర క్రీడలలో విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది.

## నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో మోటకొండూరు మండలం తేర్యాల గ్రామ నివాసి మోటాకొండూర్ మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి కుమారుని నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మరియు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు యెల్లంల సంజీవరెడ్డి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.భూపాల్ రెడ్డి కుమారున్ని ఆశీర్వదించారు.

## వికలాంగునికి చేయూతనందించిన జయశంకర్ ఫౌండేషన్ ఛైర్మన్ అయిలి మారుతి



**గణపురం, మార్చ్ 02 తరంగాలు:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రం లో నిరుపేద కుటుంబానికి చెందిన వికలాంగుడు గాజ్జల సాంబయ్య వయసు 55 గణపురంలో రోడ్డు వెంట వెళుతుంటే అటుగా వెళుతున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి గారు మనసు చలించి మానవత్వంతో వెంటనే గాజ్జల సాంబయ్య గారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ పరిస్థితి తెలుసుకొని వారికీ నిత్యవసర సరుకులు మరియు 25 కేజీల బియ్యాన్ని అందించారు. అలాగే వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు

# ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఎంపీ రవిచంద్ర



**హైదరాబాద్,మార్చి 02(తరంగాలు):** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఉప రాష్ట్రపతి జగదీప్ ధనఖర్ కు శంషాబాద్ విమానాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం ఘన స్వాగతం పలికారు.సంగారెడ్డి జిల్లా కందిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)లో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేందుకు గాను ఉప రాష్ట్రపతి జగదీప్ ధనఖర్ తన ధర్మపత్ని డాక్టర్ సుధేష్ ధనఖర్ తో కలిసి ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా ఎంపీ రవిచంద్ర పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించి వారికి హృదయపూర్వక స్వాగతం చెప్పారు.

తరంగాలు జాతీయ దిన పత్రిక
RNI . TELTEL / 2022 / 83463
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

# రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న వర్ధంతి సభలు జరపండి న్యూడెమోక్రసీ

**పాలేరు ఆర్సీ .02మార్చి(తరంగాలు)**

ప్రతిఘటన పోరాట యోధుడు అలుపెరుగని విప్లవ వీరుడు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అమరుడు రాయల సుభాష్ చంద్రబోస్ ఏడవ వర్ధంతి సభలు జరపాలని, పార్టీ నాయకత్వానికి పిలుపునిస్తున్న సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్. ఆదివారం తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో మండల కమిటీ ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ జరిగింది .ఈ జనరల్ బాడీకి పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ అధ్యక్షతన జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ భూమి. ఋక్తి. ఈ దేశ విముక్తి. పోరాటంలో అలుపెరగని ఉద్యమం చేసి అనేక లక్షల ఎకరాల పోటు భూములను కొట్టించిన మహావీరుడు రాయల సుభాష్ చంద్రబోస్ తన సుదీర్ఘకాలం పాటు 48 సంవత్సరాల అజ్ఞాత జీవితం గడిపిన వ్యక్తి తన కుటుంబమే పార్టీగా నమ్మిన సిద్ధాంతం కొరకు కడవరకు నిలబడిన వ్యక్తి కామ్రేడ్ రవన్న పార్టీలో ఎన్ని ఆంతరంగిక పోరాటాలు జరిగిన ఒకే తాటిపై నిలబడి పార్టీని నడిపించడంలో తను క్రియాశీలకంగా పని చేశాడని, చీలికలకు పేలికలకు



దారి ఇవ్వకుండా ప్రజాయుద్ధ పంథా మార్గంలోనే పార్టీని నడిపించాడని, అలాంటి వీరుడు చనిపోయి నేటికీ ఏడు సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మార్చి 11 తారీఖు నాడు ఖమ్మం భక్త రామదాసు కలక్షేత్రంలో వర్ధంతి సభ జరుగుతుందని .ఈ వర్ధంతి సభను జయప్రదం కోరుతూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆయన వర్ధంతి సభలు గ్రామ గ్రామాన సభలు జరపాలని పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా నాయకులు ఎస్కె సుబహాన్ డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి పోలే పొంగు నాగయ్య, పెరం వెంకటేశ్వర్లు,బ్రహ్మాచారి, శ్రీకాంత్, మల్సూర్, షబ్బీర్,నగేష్,విజయ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న ను సస్పెండ్ చేయడం దుర్మార్గమైన చర్య

**-పెండల సంపత్, భూపాల పల్లి జిల్లా బిసి ఇంటలెక్చువల్ ఫోరం కోఆర్డినేటర్**



**గణపురం, మార్చి 02 (తరంగాలు):**

గణపురం మండలం బస్వరాజపల్లి లో మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా బీసీల కోసం పోరాడుతున్న బీసీల ఆరాధ్య దైవం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ను సస్పెండ్ చేయడం రెడ్ల అహంకారానికి ప్రతీకగా బీసీ సమాజం భావిస్తుందని పెండల సంపత్ దుయ్య బట్టారు. జనాభాలో 60 శాతం ఉన్నటువంటి బీసీలను 42 శాతంగా సూచించిన కారణంగా సదరు వ్యవహారాన్ని వ్యతిరేకించినందుకు తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడం జరిగింది .భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటినుండి ఇప్పటివరకు ఎవరైతే బీసీ నాయకుడు బీసీల గళం విప్పుతారో బీసీలకు జరుగుతున్నటువంటి అన్యాయాలను ఎత్తిచూపుతారో బీసీల పక్షాన నిలబడతారో వారిని తక్షణమే పార్టీ నుంచి ప్రభుత్వ నుంచి తప్పించడం ఆనవాయితీగా మారింది. అగ్రకులాలకు ఆధిపత్య వర్గాలకు బీసీలు ఎప్పుడూ కూడా ఆధిపత్య కులాల అగ్రవర్ణాల పల్లకి మోసే బోయిలుగానే మిగిలిపోవాలనేది వారి యొక్క అంతర్గత ఆలోచన. నిజానికి పైకి ప్రజాస్వామ్య బద్ధంగా కనబడతారు కానీ లోపల నియంతృత్వ పోకడలకు తావిచ్చుకుంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నటువంటి సందర్భం. ఇది గతంలో చూసుకున్నట్లయితే అగ్రకులాలు ఆధిపత్య వర్గాలు కూడా ప్రభుత్వం మీద విరుచుకుపడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయి . వారిని సస్పెండ్ చేయరు వారిపై క్రమశిక్షణ చర్య తీసుకునే ధైర్యం కూడా చేయరు . వారికి బీసీలు అంటే చులకన కాబట్టి బీసీలు ఎదిగితే వారి పీఠం కదులుతుంది అందుకే ఆదిలోనే బీసీలను అణచివేస్తే రాజ్యాధికారం వైపుకు దూరంగా ఉంటారు కావున ఏలినంత కాలం వారు రాజ్యం ఏలుకోవచ్చునని అన్ని పార్టీలలో ఉన్నటువంటి ఆధిపత్య వర్గాలు అగ్రకులాల వారి ఆలోచన విధానంలో కనబడుతున్నది. బీసీ సమాజమా ఇకనైనా కళ్ళు తెరవకుంటే మన బ్రతుకులతో పాటు భావితరాల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉన్నది కావున బీసీ సోదరీ సోదరీమణులారా ఇకనైనా మనం ఏవిధంగానైతే విధి నిర్వహణ చేస్తున్నామో అదేవిధంగా మన హక్కుల కోసం మనం పోరాటం చేయాల్సిందే , మనకు చెందాల్సిన వాట ఎంత ఉందో అంత దక్కాల్సిందే. దానికోసం ఎక్కడి వరకైనా వెళ్లాల్సిందే, ఏ పోరాటానికైనా సిద్ధం కావాల్సిందే .దయచేసి ఇకనైనా మనం కలిసికట్టుగా ఉండి ఏదైనా ప్రజాస్వామ్య బద్ధంగా కొట్లాడాలే కాబట్టి ఇప్పటికైనా మన ఓటు మనం వేసుకొని బీసీలను గనుక చట్టసభల్లోకి పంపినట్లయితే చట్టం చేసేవాడు మనవాడైతే బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ సమాజం ఆలోచన విధానం.కాబట్టి సోదరులారా విడిపోయినంత కాలం మనల్ని చెడగొడుతూనే ఉంటారు మనం కలిసి ఉంటే వారే భయపడే వెళ్ళిపోతారు కావున దయచేసి బీసీ ఎస్టీ ఎస్సీ మైనారిటీ సోదరీ సోదరీమణులారా ఏకంకండి రాజ్యాధికారం వైపు ముందుకు నడుద్దాం . ఏ త్యాగానికైనా సిద్ధపడి ఉందాం . ఎంతకాలం మనం అమాయకంగా ఉంటామో అంత కాలం మన మీద కత్తులు దూస్తూనే ఉంటారు .ఈ సందర్భంగా నేను బీసీ సమాజానికి ఒక విషయం చెప్పదలచుకున్న ఎమ్మెల్సీ బీసీ బిడ్డ తీన్మార్ మల్లన్న ఏదైతే ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ 29 జీవో మహిళా బిల్లు జనగణలో జరిగిన కులగలను వ్యతిరేకించిన కారణంగా న్యాయాన్ని ఎత్తిచూపిన కారణంగా సస్పెండ్ చేయడం జరిగింది . ఈ చర్యను ఆ ప్రజాస్వామ్యగా చర్యగా భావించి ఖండిస్తు ఉన్నాము .ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జయశంకర్ జిల్లా మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షులు బిసి ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జంగిలి శ్రీనివాసరావు భూపాలపల్లి జయశంకర్ జిల్లా మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి గండు రమేష్ గణపురం మండల మున్నూరు కాపు సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన



**-కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం**


**వరంగల్ ప్రతినిధి, 02మార్చి,తరంగాలు :**

వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన అనిమిరెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి కుమారుడు వివాహానికి కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అదితిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో అనిమిరెడ్డి మధుసూదన్



రెడ్డి, సిలువేరు కుమార స్వామి, తుమ్మల యాకయ్య, అనిమిరెడ్డి నారాయణ రెడ్డి, కరిమిల్ల సంపత్ రావు,మార్త సారంగ పాణి, పెద్దూరి సంజీవరావు,భూషబోయిన సంపత్ యాదవ్, పెద్దూరి రాజ్ కుమార్, నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.


## వివాహా వేడుకలో పాల్గొన్న జిల్లా ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు ఎలిమినేటి సందీప్ రెడ్డి



**ఆలేరు ఆర్సీ, మార్చి 02(తరంగాలు):**

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిర్యాల లక్ష్మీ గార్డెన్స్ లో భువనగిరి మునిసిపల్ మాజీ చైర్మన్ పెంట నరసింహ కుమారుని వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షులు ఎలిమినేటి సందీప్ రెడ్డి, గాదె నరేందర్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ భిక్షపతి , మాజీ సర్పంచ్ సుదర్శన్, బల్రామ్ , యాట కుమార్ , డొప్ప వెంకటేష్ , బచ్చు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్..



**గణపురం మార్చి 2 తరంగాలు**

భూపాలపల్లి నియోజవర్గంలోని వివిధ గ్రామాలతో పాటు, వివిధ ఫంక్షన్ హాళ్లలో జరిగిన పలువురి వివాహ వేడుకలల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.గణపురం మండలం కొండాపూర్ గ్రామంలో చిట్టిమల్ల రవి కుమారుడి వివాహ వేడుకకు హాజరయ్యారు. గణపురం మండలం చెల్పూర్ గ్రామంలోని లక్కం జయచంద్ర గార్డెన్స్ లో జరిగిన గడ్డం మొగిలి కుమారుడి వివాహ వేడుకకు హాజరయ్యారు.

## ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

**సి.ఎస్.ఐ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జి.ఎస్.ఆర్**



**గణపురం,మార్చి 02(తరంగాలు):**



ప్రతీ విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఉన్నత స్థానానికి చేరుకోవాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. ఆదివారం గణపురం మండలం గాంధీనగర్ గ్రామంలోని సి.ఎస్.ఐ పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమంలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా పాఠశాల యాజమాన్యం మరియు విద్యార్థులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు, పాటలు నాటకాలు ప్రదర్శించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను ప్రశంసించారు.అంతేకాకుండా విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిర పడాలని ఆకాంక్షించారు.పాఠశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారం ఉంటాయని అన్నారు.అనంతరం విద్యార్థులకు మెడల్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏలియా భౌతిక దేహానికి టెస్కాబ్ చైర్మన్ మార్నేని నివాళి..



**ఐనవోలు,మార్చి 02,తరంగాలుం:**

ఐనవోలు గ్రామానికి చెందిన బరిగల ఏలియా(కోడి) అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు వారి పార్ధవ దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు





**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మార్చి 02 (తరంగాలు)**

శ్రీ దుద్దిల్ల శ్రీపాద రావు, మాజీ స్పీకర్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా ఆదివారం కలెక్టర్ ప్రధాన సమావేశ మందిరంలో శ్రీపాద రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, పాల్గొన్న అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.వీరబ్రహ్మాచారి,జిల్లా అధికారులు డిడి గ్రౌండ్ వాటర్ వేముల సురేష్, ఫిషరీస్ వీరన్న, మైనారిటీ అధికారి శ్రీనివాస్, జిఎం ఇండస్ట్రీస్ సత్యనారాయణ రెడ్డి, డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి మదన్ గోపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాజీ స్పీకర్ చిత్రపటానికి పూలమాల



**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మార్చి 02 (తరంగాలు)**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలను మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతి రావు, శ్రీపాదరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించి ఎమ్మెల్యే మురళీ నాయక్



**కేసముద్రం, మార్చి 02, (తరంగాలు)**

మహబూబాబాద్ శాసనసభ్యులు డా.భూక్యా మురళీ నాయక్ కేసముద్రం మండలం,ఉప్పరపల్లి గ్రామానికి చెందిన అరిగె దుర్గమ్మ - గోపయ్యల మనవరాలు సమృద్ధి(భార్గవి) శ్రీకాంత్, వివాహమునకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వివాహం ఒక పవిత్రమైన బంధం.ఈ కొత్త దాంపత్య జీవితాన్ని ప్రారంభిస్తున్న వధూవరులు ఆనందంగా,సౌభాగ్యంగా జీవించాలని మనసారా కోరుకుంటున్నాననీతెలిపారు.ఒక కుటుంబ వ్యవస్థ బలంగా ఉండాలి అంటే పరస్పర అవగాహన,ప్రేమ,గౌరవం ముఖ్యమైనవి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి,డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు,మాజీ జడ్పీటిసి బండారు వెంకన్న,కథిరే సురేందర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారు దయాకర్,గ్రామ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు,మార్కెట్ డైరెక్టర్లు చింతకుంట్ల యాదగిరి,అయూబ్ ఖాన్,అరిగే విజేందర్,కొమాకుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ చైర్మన్ కు సన్మానం



**కేసముద్రం, మార్చి 02, (తరంగాలు)**

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన గంట సంజీవరెడ్డిని కల్వల గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంజీవ రెడ్డి ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలని సూచించారు.అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా మాందాటి వెంకటరెడ్డి,ప్రధాన కార్యదర్శిగా గంట రామ్మోహన్ రెడ్డి,ఉపాధ్యక్షులుగా మెండు జగన్ రెడ్డి సహాయ కార్యదర్శిలుగా గుర్రం నరేందర్ రెడ్డి,కొప్పుల మల్లారెడ్డి,కార్యవర్గ సభ్యులుగా మెండు శ్రీనివాస్ రెడ్డి, వంటల అనిల్ రెడ్డి, గంట మహేందర్ రెడ్డి లను ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షులు గంట బాలకృష్ణారెడ్డి, కొమ్మల యాకుబ్ రెడ్డి, ఎడవల్లి శ్రీనివాస్ రెడ్డి, గంట అశోక్ రెడ్డి, పెరటి జైపాల్ రెడ్డి తదితరులున్నారు.

## ధైద వెంకటయ్య దశదినకర్మకు హాజరైన అంబటి మహేందర్ రెడ్డి, చిలువేరు సమ్మయ్య గౌడ్





### -50 కేజీల బియ్యం,నెలకు సరిపడా నిత్యవసర వస్తువులు అందజేత

**కేసముద్రం, మార్చి 02, (తరంగాలు)**

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని ధన్నసరి గ్రామ క్రాస్ రోడ్డు వద్ద ధైద వెంకటయ్య దశదినకర్మకు డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ధైద వెంకటయ్య చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం వారి కుటుంబానికి 50 కేజీల బియ్యం నెలకు సరిపడా నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రం శెట్టి అశోక్,చీకటి కిరణ్, కళాధర్,ప్రశాంత్,కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కొండ సురేష్,మాజీ వార్డు సభ్యులు గోపాల నరేందర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ నాయకులు గోపాల శ్రీనివాస్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ చింతకుంట్ల యాదగిరి,ఓబీసీ సెల్ ప్రెసిడెంట్ శీలం మునిష్ గౌడ్,జి ఎం పి ఎస్ కేసముద్రం మండల ప్రధాన కార్యదర్శి తండ మహేష్,నర్ర అశోక్,వేముల శ్రీనివాస్,చారి,కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగాల ఐలయ్య,ఇనగాల సుదీష్ రెడ్డి,పింగిలి నాగరాజు,మాలి మురళి,కొండా శ్రీను,కొండేటి దీపక్,లింగాల అరవింద్,రేసు సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన





**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మార్చి 02 (తరంగాలు)**

మహబూబాబాద్ జిల్లా, మండలం. పర్వతగిరి, సోమ్లా తండా గ్రామంలో నిర్వహించిన హెల్త్ క్యాంపుకు ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మానుకోట జిల్లా కేంద్రంకు చెందిన న్యూవే ఫౌండేషన్, శ్రీసత్య లయన్స్ కంటి దవాఖాన, జీవనజ్యోతి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్యాంపుకు విశేష స్పందన లభించింది. వృద్ధులు, మహిళలు, యువకులు భారీ సంఖ్యలో విచ్చేసి తమ ఆరోగ్య సమస్యలు తెలుపుకున్నారు. న్యూవే ఫౌండేషన్ చైర్మన్, శ్రీసత్య లయన్స్ కంటి హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు వ్యవస్థాపకులు, బేరా సోసైటీ చైర్మన్ డాక్టర్ లయన్ ధారావత్ రెడ్డి నాయక్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలం, పర్వతగిరి సోమ్లా తండా గ్రామం నందు ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో ప్రజలనుంచి ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, ఎండి జనరల్, బీపీ, షుగర్, మూత్ర పరీక్షలు, థైరాయిడ్ పరీక్షలు చేసి, మందుల పంపిణీ, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ శ్రీసత్య లయన్స్ కంటి హాస్పిటల్, జీవనజ్యోతి హాస్పిటల్ వారి సహకారంతో ఆదివారం మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం, పర్వతగిరి గ్రామంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సోమ్లా




తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ బాలాజీ నాయక్ మాట్లాడుతూ ఈ శిబిరం పేదలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎటువంటి ఫీజు లేకుండా మన ఇంటి దగ్గరికి వచ్చి ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్న లయన్స్ క్లబ్ కంటి హాస్పిటల్, జీవనజ్యోతి హాస్పిటల్, బిగ్ టీవీ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు. మారుమూల గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నందుకు, మరియు అవగాహన కల్పిస్తున్న శ్రీ సత్య లయన్స్ కంటి హాస్పిటల్ లకు ప్రతేక ధన్యవాదములు. డాక్టర్ కరుణాకర్ లునావతు బీ.ఎ.ఎం.ఎస్ ఎండీ సీనియర్ ఆయుర్వేద వైద్యుడు మాట్లాడుతూ మహబూబాబాద్ మండలం పర్వతగిరి సోమ్లా తండా నందు మెగా ఉచిత క్యాంపు నందు పంచకర్మ స్పెషలిస్ట్ జీవనజ్యోతి నేచర్ క్యూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డాక్టర్ ప్రమోద్ రెడ్డి హాస్పిటల్ పక్కన, నెహ్రూ సెంటర్, మహబూబాబాద్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. 150 మందికి మోకాళ్ళ నొప్పులు, కీళ్లవాతం, ఆర్థరైటిస్, రుమటాడ్ ఆర్థరైటిస్, పక్షవాతం, నరాల బలహీనత, స్పాండిలైటిస్, సర్వైకల్ స్పాండిలైటిస్, లూంబార్స్ స్పాండిలైటిస్, పైల్స్, ఫిస్టులా, ఫిషర్ దీర్ఘకాలిక చర్మ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో న్యూవే ఫౌండేషన్ చైర్మన్, శ్రీసత్య లయన్ చారిటబుల్ కంటి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు వ్యవస్థాపకులు, భేరా సొసైటీ చైర్మన్ డాక్టర్ లయన్ ధారావత్ రెడ్డి నాయక్, జీవనజ్యోతి హాస్పిటల్ లునావత్ కరుణాకర్, డాక్టర్ బోద కిషోర్, బిగ్ టీవీ ప్రతినిధులు యశ్వంత్, వీరేందర్, సోమ్లా తండా మాజీ సర్పంచ్ ఇస్లావత్ బాలాజీ నాయక్, మేనేజర్ ధారావత్ బాలు నాయక్, అంగోత్ అఖిల్, రాజేష్, పి ఆర్ ఓ మోహన్ నాయక్, ప్రముఖ జర్నలిస్టు ఎర్రోజు అశోక్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ జాటోత్ రాజశేఖర్, జీఎన్ఎమ్ వాంకుడోత్ వెన్నెల, దివ్య, సానియా, ఏఎన్ఎమ్ సరిత, పి. పూజ, ఆశ వర్కర్స్ కైలా, రమాదేవి, అర్చన, రామ, జీవనజ్యోతి హాస్పిటల్ సిబ్బంది, పి ఆర్ ఓ, పర్వతగిరి, సోమ్లా తండా గ్రామప్రజలు, యువకులు, తదితరులు ఉన్నారు.

## ధారావత్ చిట్టిబాబు ఆరోగ్యం క్షీణించింది

**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మార్చి 02 (తరంగాలు)**

నిన్న వివిధ దినపత్రికలలో మరియు ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చినటువంటి వార్తకు అనుగుణంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మురళీధర్ పర్యవేక్షణలో, గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఐసీయూ లో ఉన్న ధారావత్ చిట్టిబాబు అను వ్యక్తిని పరిశీలించగా అతని యొక్క పరిస్థితి క్రిటికల్గా ఉన్నదని డ్యూటీ డాక్టర్ తెలియజేసినారు. అక్కడున్న పేషెంట్ యొక్క అటెండెంట్ నవీన్ ని అడగగా గత కొన్ని రోజులుగా చిట్టిబాబు ఆరోగ్యము క్షీణించి, ప్రైవేట్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించటం జరిగిందని అన్నారు. డబ్బులు లేని పక్షంలో గవర్నమెంట్ హాస్పటల్లో నిన్న అడ్మిట్ చేయడం జరిగిందని మా పరిశీలనలో తను సంవత్సరం క్రితం నల్లెల గ్రామము, గాజే తండకు చెందినటువంటి ధారావత్ చంద్రుకు కిడ్నీ ఇవ్వటం జరిగినది. అప్పుడు వారిద్దరు గచ్చిబౌలిలోనీ కేర్




ఆస్పత్రిలో మూడు నెలల వరకు ట్రీట్మెంట్ తీసుకోవటం జరిగినది. ఈ మధ్యన తాగుడుకు బానిసై అనారోగ్యంగా ఉండటం వలన ఫిట్స్ రావడం జరిగినది. అందుకుగాను వారి కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించటం జరిగినది. ఇట్టి విషయంలో కురవి పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ వివరణ ప్రకారము ఇరువురి పరస్పర అంగీకారంతోనే కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స హైదరాబాదులోని, గచ్చిబౌలిలో ఉన్నటువంటి కేర్ ఆస్పత్రిలో గత సంవత్సరం 18/10/2023 న జరిగినదని తెలియజేయడం జరిగినది. ఇట్టి విచారణలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



డాక్టర్ మురళీధర్ తో, డాక్టర్ విజయకుమార్ ఎంక్వయిరీ ఆఫీసర్, డాక్టర్ విరాజిత, కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సబ్ యూనిట్ ఆఫీసర్ వోబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

తరంగాలు జాతీయ దిన పత్రిక RNI . TELTEL / 2022 / 83463 Tharangalu Daily News Paper ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

# ఎ కన్వెన్షన్ నూతన ఫంక్షన్ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు






**హనుమకొండ ప్రతినిధి,మార్చి 02,తరంగాలు :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 64వ డివిజన్ మడికొండ ధర్మసాగర్ రోడ్డు లో గల ఏ కన్వెన్షన్ నూతన ఫంక్షన్ హాల్ ను వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.అనంతరం యాజమాన్యానికి ఎమ్మెల్యే నాగరాజు శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.ముందుగా యాజమాని రాచర్ల శంకరయ్య కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే నాగరాజు కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు.అనంతరం పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తదనంతరం యాజమాన్యం ఎమ్మెల్యే నాగరాజు కి బహుమతి ప్రధానం చేసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న




### ఆర్ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ యువనేత నల్లమోతు సిద్ధార్థ

**మిర్యాలగూడ ఆర్సీ, మార్చి 02,తరంగాలు :** శ్రీ సీతారాముల స్వామి వారి నూతన ధ్వజ స్థంభ ప్రతిష్ఠాపన మరియు గ్రామ బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ యువనేత నల్లమోతు సిద్ధార్థ పాల్గొన్నారు. దామరచర్ల మండలంలో గణేష్ పహాడ్ గ్రామంలోని శ్రీ సీతారాముల స్వామి వారి నూతన ధ్వజ స్థంభ ప్రతిష్ఠాపన మరియు మరియు గ్రామ బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ మిర్యాలగూడ నియోజకవర్గ యువనేత నల్లమోతు సిద్ధార్థ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ఆలయ కమిటీ సభ్యులు సిద్ధార్థ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీ సీతారాముల స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందు గ్రామ బీ ఆర్ ఎస్ పార్టీ యువకులు పెద్దఎత్తున స్వాగతం పలికి డిజే తో ఊరేగింపుగా బొడ్రాయి ప్రతిష్ట వద్దకు తీసుకెళ్ళి పూజలు చేయించారు. అనంతరం మహిళలు, యువకులు, గ్రామ ప్రజలతో కలిసి సిద్ధార్థ నృత్యాలు చేసి కార్యకర్తల్లో నూతన ఉత్తేజం తెచ్చారు.ఈ కార్యక్రమంలో అంగోతు హాతీరాం నాయక్, సోము సైది రెడ్డి, బాల సత్యనారాయణ, రమావత్ సైదు నాయక్, సైదా నాయక్, గొరియా నాయక్, మేశ్య నాయక్, రమేష్ నాయక్, కృష్ణా నాయక్, చలపతి, వెంకట రెడ్డి, రఫీ భాయ్, శ్రీను నాయుడు, గొరియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరో మిత్ర హెల్త్ టు ఆల్ సేవ సంస్థ ఆఫీస్ ప్రారంభోత్సవం

### కిసాన్ పరివార్ సంస్థ సీ ఈ వో డాక్టర్. వివేక్





**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మార్చి 02 (తరంగాలు)** నిన్న మహబూబాబాద్ జిల్లా కేంద్రం నెహ్రూ సెంటర్ లో ఆరో మిత్ర హెల్త్ టు అల్ సంస్థ ఆఫీస్ నీ ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన డాక్టర్ వివేక్ ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అణగారిన బీద ప్రజలకు మెరుగైన వైద్యపరీక్షలు నిర్వహించాలనా అని అన్నారు.మెరుగైన వైద్య పరీక్షలు అందించాలని ఉద్దేశంతో మెగా మాట్రిక్స్ దయాగ్నొస్టిక్ సెంటర్ నీ ప్రారంభించారు..అందరికి 50% రాయితీ వైద్య పరీక్షలు నిర్వహించాలని సంస్థని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్. నెహ్రూ నాయక్ ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ.ఫరీద్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు భీమా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు డాక్యుమెంట్లు, డబుల్ రిజిస్ట్రేషన్లతో మోసం

### మోసం చేసిన ముఠా పై కేసు నమోదు

### ఇన్స్పెక్టర్ భానుప్రకాశ్



**ఖమ్మం జిల్లా బ్యూరో/మార్చ్ 2 (తరంగాలు) ఖమ్మం :** భూములు లేకపోయినా తప్పుడు రిజిస్ట్రేషన్లు,డబుల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ద్వారా రుణాలు ఇప్పిస్తామంటూ అమాయకులను నమ్మించి మోసం చేస్తున్న ముఠా పై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం ఖానాపురం హవేలీ ఇన్స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు. ఇటీవల నగరంలో భూమి క్రయవిక్రయాలు తగ్గడంతో అక్రమార్జనకు అలవాటు పడిన మాయగాళ్లు ఖరీదైన భూములకు డాక్యుమెంట్లు సృష్టిస్తూ.. తప్పుడు రిజిస్టర్ డాక్యుమెంట్లకు రుణాలు ఇప్పిస్తూ...రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న మధుర నగర్ ప్రాంతానికి చెందిన షేక్.బడే సాహెబ్, చింతకాని మండలం పాతర్లపాడు కు చెందిన కొత్తపల్లి వేంకటేశ్వర్లు తిప్పర్తి అశోక్ కుమార్ (ఆర్ ఐ రెవెన్యూ )పై కేసు నమోదు చేసి వీరి వద్ద నుంచి మరిన్ని రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకునట్లు తెలిపారు.కొత్త రకం దందా వ్యవహారంలో మరింత లోతుగా విచారణ సాగుతుందని ఇన్స్పెక్టర్ భాను ప్రకాష్ తెలిపారు.

# సోడా యూనియన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి (సి ఐ టీ యు)

### సోడా యూనియన్ గౌరవ అధ్యక్షులు.. కుమ్మరికుంట్ల నాగన్న.



**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మార్చి 02 (తరంగాలు)** నిన్న సోడా యూనియన్ కార్మికుల సమావేశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వఠ్రీపెల్లి శ్రీను అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.యూనియన్ గౌరవ అధ్యక్షులు కుమ్మరికుంట్ల నాగన్న హాజరయ్యి మాట్లాడుతూ సోడా కార్మికులు రోడ్ల పైన అక్కడక్కడ బండి పెట్టుకొని సోడాలు అమ్ముకోనే క్రమంలో వీరి పైన ఒకపక్క మున్సిపల్ అధికారులు, పోలీసు వ్యవస్థ,షాపులు యజమానులు వారిని రోడ్డుపైన వ్యాపారం చేసోకుంట వెళ్లగొట్టడం జరుగుతుంది.అందుకే మున్సిపాలిటీ పోలీసు వ్యవస్థ వారికి అడ్డాలు ఏర్పాటు చేసి వారి వ్యాపారానికి అండగా నిలబడాలని కోరారు. సోడా బండి కార్మికులకు లేబర్ కార్డులు ఇచ్చి 50 సంవత్సరాలు దాటిన ప్రతి యూనియన్ సభ్యునికి 6000 పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఇండ్లు లేని వారికి ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వము వారికి ఆర్థిక సాయం కూడా చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఫ్జల్,శ్రీను, మక్బూల్ ,ఐలయ్య, వెంకన్న, మల్లయ్య, ముత్తయ్య, బిక్షపతి, చంద్రయ్య, ఉప్పలయ్య, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

### రూ.4 వేలు అందజేసిన పిఎసిఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా



**వర్ధన్నపేట, మార్చి 02,తరంగాలు :** వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నల్లతిగల ఉప్పలయ్య శనివారం సాయంత్రం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పిఎసిఎస్ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా ఆదివారం ఉప్పలయ్య భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి,రూ.4 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో నల్లతిగల రవి,రాజేంద్రప్రసాద్, నల్లతిగల శివ,లక్ష్మణ్, రాజబాబు,బూర రవీందర్,కారోబర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాడిచెట్లు ఎక్కిన ప్లాస్టిక్ బాటిల్స్

### మట్టిలోట్ల స్థానంలో ప్లాస్టిక్ బాటిల్స్ వాడకం



**గణపురం మార్చి 02 తరంగాలు:** కాలం మారింది అనడానికి ఇదే నిదర్శనం తాడి చెట్లకు మట్టి లొట్లు పెట్టే గౌడ సోదరులు పరిస్థితుల ప్రభావంతో తాటి చెట్లు గెలలకు ప్లాస్టిక్ బాటిల్లను అమరుస్తున్నారు. మండలంలోని ధర్మరావుపేట గ్రామ పరిధిలో తాడిచెట్లకు గీత కార్మిక సోదరులు మట్టి లొట్ల స్థానంలో ప్లాస్టిక్ బాటిల్లను ఏర్పాటు చేశారు. తాడిచెట్ల గెలలకు ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ బాటిల్లు అందరినీ ఆకర్షిస్తున్నాయి.

# మంజి భౌతిక దేహానికి ఎమ్మెల్యే భూక్యా మురళి నాయక్ నివాళి





**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మార్చి 02 (తరంగాలు)** మహ బూబాబాద్ మండలం, కేవుల తండా (జంగిలిగొండ) గ్రామానికి చెందిన కెవుల తాండ గ్రామ సిబ్బంది కీఎంశేఎం బాదవత్ మంజి విద్యుత్ షాక్ తో మృతి చెందగా మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్ లో పోస్టు మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అదే విధంగా వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కలిగించి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు.

తరంగాలు జాతీయ దిన పత్రిక RNI. TELTEL / 2022 / 83463 Tharangalu Daily News Paper

# స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి..


శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి -బీఎల్ఆర్





**మిర్యాలగూడ ఆర్సీ, 02మార్చి,తరంగాలు:** స్వామి వారి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి -బీఎల్ఆర్ అన్నారు.ఆదివారం దామరచర్ల మండలం గణేష్ పాడ్ గ్రామంలో శ్రీ హనుమ సీతా సమేత రామలక్ష్మణుల ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ మరియు బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి -బీఎల్ఆర్ గ్రామస్థులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,బీఎల్ఆర్ బ్రదర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మా అసోసియేషన్ అధ్యక్షులు లయన్ బొడ్డుపల్లి ఉపేంద్రం




**మహబూబాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 02, (తరంగాలు):** మహబూబాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆర్థి గార్డెన్లో కొల్లాపురం గూడూరు మండల కేంద్రానికి చెందిన మట్టపల్లి జగదీశ్వర్ రావు, ఉమా దంపతుల కూతురు దివ్య- అరవింద్ వివాహ వేడుకకు మహబూబాబాద్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ బొడ్డుపెల్లి ఉపేంద్రం హాజరై నూతన వదువరులను ఆదిర్వధించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ బొడ్డుపెల్లి ఉపేంద్రం,ఏ బి ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు ఇనుగుర్తి సుధాకర్ తదితరులు ఉన్నారు.

## నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫోటో గ్రాఫర్ రఘుకు శంకర్ నాయక్ పరామర్శ



**మహబూబాబాద్ జిల్లా బ్యూరో మార్చి 02 (తరంగాలు)** మహబూబాబాద్ జిల్లా నమస్తే తెలంగాణ దిన పత్రిక స్టాఫ్ ఫోటో గ్రాఫర్ రఘు కొద్దీ రోజుల క్రితం బైక్ ప్రమాదంలో గాయపడగా మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పరామర్శించారు.

## కూసుమంచి షేక్ సాఫీయా ఇంట్లో చోరీ .



**పాలేరు ఆర్సీ 02మార్చి (తరంగాలు).** కూసుమంచి షేక్ సఫియా w/o నాగుల్ మీరా. లేటు. తన కుటుంబ సభ్యులతో కలిసి. ది. 27/ 2 /2025 న మధ్యాహ్నం 3 గంటలకు తన ఆడబిడ్డ ఊరు అయిన సూర్యాపేటకు వెళ్లి .తిరిగి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గమనించిన సాఫియా ఇంట్లోకి వెళ్లి చూడగా, ఇంట్లో ఉన్న రెండు తులాల బంగారు తాడు, 25 తులాల వెండి పట్టీలు మరియు 15 వేల రూపాయలు నగదు . ఎవరో దొంగిలించి ఉంటారని ఫిర్యాదు చేశారు. వెంటనే ఆమె ఫిర్యాదు మేరకు కూసుమంచి ఎస్సై నాగరాజు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .

# ఘనంగా మాజీ స్పీకర్ శ్రీపాద రావు జయంతి వేడుకలు







**వరంగల్ ప్రతినిధి,02మార్చి,తరంగాలు:** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ననుసరించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఆదివారం జయంతి వేడుకలు చేపట్టగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హాజరై మాజీ స్పీకర్ దుద్దిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి,డి ఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం









**హన్మకొండ ప్రతినిధి,02మార్చి,తరంగాలు:** ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి ఆద్వర్యంలో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఆదివారం మెడికవర్ హాస్పిటల్ వారి సహకారంతో సీనియర్ సిటిజన్స్ కి హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ లైన్ లోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్ లో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ప్రముఖ పలమనాలజిస్ట్ ఎస్. పూర్ణ చంద్ రెడ్డి సారథ్యంలో శ్వాస కోశ వ్యాధుల బారిన పడకుండా ఎలా నివారించవచ్చు,వ్యాధి బారిన పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గెస్ట్ స్పీకర్ గా ప్రతి అంశాన్ని వివరించారు. వృద్ధులు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు చెప్పారు.డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ వృద్ధుల సేవ దైవ సేవ అని వారి కోసం ఏది చేసిన తనకు సంతోషంగా సంతృప్తిగా ఉంటుందని అన్నారు.సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ గా వృద్ధులకు సహాయ సహకారాలు అందించడం తన బాధ్యత గా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమానికి పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి, డాక్టర్ పూర్ణ చంద్ రెడ్డి, డాక్టర్ అనితా రెడ్డి, మెడికోవర్ హాస్పిటల్ మార్కెటింగ్ డైరెక్టర్ ప్రవీణ్, వైద్యులు, అసోసియేషన్ భాద్యులు,, వయోవృద్ధులు, బ్లూ చిప్ ప్రతినిధులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన టీపీసీసీ సభ్యులు




**నెక్కొండ,మార్చి 2 ( తరంగాలు):** నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన మెర్గు మల్లయ్య హైమావతి దంపతుల కుమార్తె నవ్య శ్రీ-శ్రీకాంత్ ల వివాహ మహోత్సవానికి నర్సంపేట పీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి, నెక్కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కి అశోక్ ,నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్,మండల కాంగ్రెస్ నాయకులు ఈదునూరు సాయి కృష్ణ,కుసుమ చెన్నకేశవులు, పోలిశెట్టి భాను ప్రకాష్,ఆవుల శ్రీనివాస్,మెర్గు విజయ్, నర్సంపేట కోర్టు ఏజిపి బండి శివకుమార్, నెక్కొండ మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, నెక్కొండ యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ముద్ర బోయిన శ్రీకాంత్, దీక్షకుంట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మెర్గు కుమారస్వామి, పులి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దొంతి




**నెక్కొండ,మార్చి 2( తరంగాలు):** నెక్కొండ మండలం పత్తిపాక గ్రామానికి చెందిన లావుడియా సునీత బికీ.శేసోమ దంపతుల కుమార్తె నికిత-విక్రమ్ ల వివాహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యేతో పాటు పీసీసీ సభ్యులు రంజిత్ రెడ్డి, పెండెం రామానంద్ నెక్కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, పర్వతగిరి మాజీ జడ్పీటీసీ సింగులాల్ పత్తి పాక మాజీ సర్పంచ్ సరిత తిరుమల్, మండల కాంగ్రెస్ నాయకులు ఈదునూరు సాయి కృష్ణ, కుసుమ చెన్నకేశవులు, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పోలిశెట్టి భాను ప్రకాష్,ఆవుల శ్రీనివాస్, నర్సంపేట కోర్టు ఏజిపి బండి శివకుమార్, ప్రతిపాక కాంగ్రెస్ అధ్యక్షుడు ఉశీలపాటి రాజు, బొల్లె బోయిన సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# జీఎస్టీ వసూళ్లు 1.84 లక్షల కోట్లు

## డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా.. ఈ టూ వీలర్స్‌పై జాలీగా రైడ్ చేయవచ్చు..



పెట్రోల్ లేదా డీజిల్‌తో నడిచే టూ వీలర్స్ కంటే ఈవీ వాహనాలకు అయ్యే ఖర్చు తక్కువ. నిజానికి, 1988 మోటారు వాహనాల చట్టం ప్రకారం.. 25 కిలోమీటర్ల గరిష్ఠ వేగం, 250 వాట్ల కంటే తక్కువ శక్తి కలిగిన వాహనాలను డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే డ్రైవ్ చేయవచ్చు. ఇక ఈ మధ్య కాలంలో మంచి రేంజ్ ఇచ్చేందుకు ఈవీ స్కూటర్లలో అధిక శక్తిగల మోటార్లను వినియోగిస్తున్నారు. అలాంటి 4 అత్యుత్తమ మోడళ్ల గురించి తెలుసుకుందాం..

**లోహియా ఓమా స్టార్**

దీని ప్రారంభ ధర రూ. 51,750లు. బ్యాటరీ 3 సంవత్సరాల వారంటీ ఇస్తారు. 4.5 నుండి 5 గంటల్లో పూర్తిగా ఛార్జ్ అవుతుంది. ఇంధన సామర్థ్యం 4.5 లీటర్లు. 70 కి.మీ రేంజ్‌తో గంటకు 25 కి.మీ వేగంతో వెళుతుంది.

**ఆంపియర్ రియో ??ఎలైట్**

ఆంపియర్ రియో ??ఎలైట్ స్కూటర్ ధర రూ.42,999 నుంచి ప్రారంభమవుతుంది. బరువు 94 కిలోలు. వారంటీ 3 సంవత్సరాలు. 60%ఎ, 20రాష్ట్ర% లిథియం-అయాన్ బ్యాటరీ ఉంటుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 60 కి.మీ. వరకు వెళుతుంది. 4-5 గంటల్లో పూర్తి ఛార్జ్ అవుతుంది. గరిష్ఠ వేగం గంటకు 25 కి.మీ. ఎరుపు, నీలం, తెలుపు, నలుపు రంగుల్లో లభ్యమవుతుంది.

**కోమాకి ఎక్స్‌జీటీ కేఎం**

కోమాకి ఎక్స్‌జీటీ కేఎం ఈవీ ప్రారంభ ధర రూ.60,279. ఒకసారి ఛార్జ్ చేస్తే 100కి.మీ వెళ్తుంది. వేగం గంటకు 60 కిలోమీటర్లు. . 4-5 గంటల్లో పూర్తిగా ఛార్జ్ అవుతుంది. ఇది 130-150 కి.మీ రేంజ్ అందిస్తుంది. బ్యాటరీకి 1 సంవత్సరం వారంటీ ఇస్తారు.

**ఒకినావా ఆర్30**

ఒకినావా ఆర్30 ఎలక్ట్రిక్ స్కూటీ ప్రారంభ ధర రూ.61,998 వరకు ఉంటుంది. . 3 సంవత్సరాల పాటు బ్యాటరీకి వారంటీ వస్తుంది. 250 వాట్ల శక్తితో నడిచే ఈ స్కూటర్ 60 కి.మీ రేంజ్ ఇస్తుంది. గంటకు 25 కి.మీ వేగంతో వెళ్లవచ్చు. 5 గంటల్లో ఛార్జ్ అవుతుంది

## గతంతో పోల్చితే ఫిబ్రవరిలో 9.1 శాతం వృద్ధి




జీఎస్టీ వసూళ్లు మరోసారి భారీ స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో రూ.1.84 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో వసూలైన రూ.1.68 లక్షల కోట్లతో పోలిస్తే 9.1 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది. దేశీయ వినిమయం పుంజుకోవడం, ఆర్థిక రంగం తిరిగి వృద్ధి బాట పట్టడం వల్లనే జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదవుతునాయని వెల్లడించింది. గత నెలలో వసూలైన రూ.1.84 లక్షల కోట్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.35,204 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.43,704 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.90,870 కోట్లు, పరిహారం సెస్ రూపంలో రూ.13,868 కోట్లు వచ్చాయని పేర్కొంది. జీఎస్టీ వసూళ్లలో దేశీయంగా వచ్చిన ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10.2 శాతం ఎగబాకి రూ.1.42 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్ను ద్వారా రూ.41,702 కోట్లు సమకూరాయి. అలాగే రూ.20,889 కోట్ల పన్నును రిఫండ్ రూపంలో చెల్లించింది. ప్రస్తుత సంవత్సరం తొలి నెల జనవరిలో రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి. దీనిపై ఈవై ట్యాక్స్ పార్టనర్ సౌరభ్ అగర్వాల్ మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శణమని, అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితిలో ఉన్నప్పటికీ పన్ను వసూళ్లు ఇంచుమించు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషమన్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లు 10 శాతం నుంచి 20 శాతం వరకు అధికమవగా, అలాగే తెలంగాణతోపాటు గుజరాత్, అసోం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో 1 శాతం నుంచి 4 శాతం వరకు పెరిగాయి.

## అల్ట్రాటెక్‌లో కేశోరాం విలీనం

ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్‌లో బీకే బిర్లా గ్రూపునకు చెందిన కేశోరాం సిమెంట్ విలీనమయ్యాయి. ఇందుకు సంబంధించి పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్ వద్ద ఉన్న యూనిట్‌లో ఇందుకు సంబంధించి అధికారిక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 50 ఏండ్ల క్రితం ఉత్తర తెలంగాణలోని బసంత్‌నగర్‌లో బీకే బిర్లా సిమెంట్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ఆతర్వాతి క్రమంలో ఇక్కడే కేశోరాం సిమెంట్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం ఈ కేశోరాం సిమెంట్‌ను ఆదిత్యా బిర్లా గ్రూపు కొనుగోలు చేయడంతో ఇకనుంచి ఈ ప్లాంట్‌లో అల్ట్రాటెక్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శనివారం ఈ యూనిట్‌లో కార్మికులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటుచేసి, అధికారికంగా అల్ట్రాటెక్ లోగోను ఆవిష్కరించారు.





## కివిస్‌పై 44 పరుగులతో టీం ఇండియా గెలుపు

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో టీం ఇండియా, న్యూజిలాండ్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 250 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేధించడంలో కివిస్ వెనుక పడింది. కన్ విలియమ్సన్, మిచెల్ శాంత్నర్, విల్ యంగ్ మినహా మిగతా బ్యాటర్లెవరూ క్రీజ్‌లో నిలబడలేక పోయారు. 250 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్దేశిత 50 ఓవర్లలో మరో 27 బంతులు మిగిలి ఉండగానే 205 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో న్యూజిలాండ్‌పై టీం ఇండియా 44 పరుగుల తేడాతో విజయం సాధించి.. సెమీస్‌లో బెర్త్‌ను ఖరారు చేసుకుంది. సెమీస్‌లో ఆస్ట్రేలియాతో టీం ఇండియా తల పడనున్నది. 250 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కివిస్ ఓపెనర్లు విల్ యంగ్, రుచిన్ రవీంద్రల్లో రవీంద్రను ఆరు పరుగులకే హార్దిక్ పాండ్యా బౌలింగ్లో అక్సర్ పటేల్ క్యాచ్ పట్టి పెవిలియన్ బాట పట్టించాడు. అటుపై 49 పరుగుల వద్ద వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో విల్ యంగ్ క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత వన్ డౌన్ బ్యాటర్‌గా వచ్చిన కేన్ విలియమ్సన్ .. సహచర బ్యాటర్లు ఔటవుతున్నా నిలకడగా ఆడుతూ 81 పరుగులు చేశాడు. కానీ 41వ ఓవర్‌లో అక్షర్ పటేల్ వేసిన చివరి బంతిని కేఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చి కేన్ విలియమ్సన్ ఔట్ కావడంతో కివిస్ ఆట కట్టించారు. డెరిల్ మిచైల్, టామ్ టాథమ్, గ్లెన్ ఫిలిప్స్, మిచెల్ బ్రేస్ వెల్ ఎల్‌బీడబ్ల్యూ అయ్యారు. భారత్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లు, కుల్దీప్ యాదవ్ రెండు, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ తీశారు. తొలుత బ్యాటింగ్ చేసిన టీం ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 249 పరుగులు చేసింది. టీం ఇండియా సారధి రోహిత్ శర్మ 15, విరాట్ కోహ్లీ 11 పరుగులకే పెవిలియన్ బాట పట్టినా అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్‌లతో కలిసి శ్రేయాస్ అయ్యర్ జట్టు స్కోర్ పెంచేందుకు ప్రయత్నించాడు. శ్రేయాస్ అయ్యర్ 79 పరుగులు, అక్షర్ పటేల్ 42 పరుగులు, హార్దిక్ పాండ్యా 45 పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ ఐదు, కైల్ జామియాసన్, విల్ ఓ రూర్కే, మిచెల్ శాంత్నర్, రచిన్ రవీంద్ర చెరో వికెట్ తీశారు.



# స్పోర్ట్స్

## స్టన్నింగ్ క్యాచ్ తో కోహ్లీని పెవీలియన్ కు పంపిన ఫిలిప్స్..



2025 చాంపియన్స్ ట్రోఫీలో ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన గ్రూప్ A చివరి మ్యాచ్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ త్వరగా అవుట్ కావడంతో, విరాట్ కోహ్లీ బ్యాటింగ్‌కు వచ్చారు. కోహ్లీ 300వ ODI మ్యాచ్ ఆడుతుండటంతో అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. కానీ ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీకి నిరాశే ఎదురైంది. ఇందుకు కారణం న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిప్స్. బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న ఫిలిప్స్ ఒక చేత్తో అద్భుతమైన క్యాచ్‌ను తీసుకుని కోహ్లీని పెవిలియన్‌లో పంపించాడు. కోహ్లీ బంతిని కట్ చేసి బలంగా షాట్ కొట్టినట్లు కనిపించింది, ఇది సునిశ్చితమైన బౌండరీగా అనిపించింది, కానీ దాన్ని ఫిలిప్స్ తన అద్భుతమైన ఫీల్డింగ్‌తో అందుకున్నాడు. కోహ్లీ ఈ అద్భుతమైన క్యాచ్‌ను చూసి ఆశ్చర్యపోయారు, ఎందుకంటే ఫిలిప్స్ చేసిన ఆక్రోబాటిక్ ప్రయత్నం ఆయనకు నమ్మలేనిదిగా అనిపించింది. ఇది నిజంగా ఒక అద్భుతమైన క్యాచ్. కోహ్లీ అర్థం కాని విధంగా ఫిలిప్స్ వైపు చూసి డగౌట్ వైపు తిరిగిపోయారు. ఫిలిప్స్ చేసిన అద్భుతమైన క్యాచ్‌తో entire క్రౌడ్ కూడా ఆశ్చర్యపోయింది.కోహ్లీ ఈ మ్యాచ్‌లో 14 బంతుల్లో 11 పరుగుల కొరకు అవుట్ అయ్యారు. కోహ్లీ తన 300వ ఓడీఐ మ్యాచ్‌లో Matt Henry బౌలింగ్‌లో ఒక అద్భుతమైన బౌండరీ కొట్టాడు. Henry వేసిన 5వ ఓవర్‌లో, కోహ్లీ ఫుల్ బంతికి ముందుకు వచ్చి ఎగురుతూ కొట్టాడు. బెట్ తిరుగుతూ, బంతి ఆపై ఇన్నర్ హాఫ్‌లో పడ్డది, ఇది బౌండరీగా మార్చబడింది. అనంతరం మ్యాట్ హెన్రీ కోహ్లీని అవుట్ చేసి న్యూజిలాండ్‌కు కీలక వికెట్ తీసుకున్నారు. ఈ అద్భుతమైన క్యాచ్‌ను ఫిలిప్స్ అందించిన క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# రంజీ ఛాంప్ విదర్భ

## ఫైనల్లో కేరళకు తప్పని నిరాశ

నాగ్‌పూర్ (మహారాష్ట్ర) : రంజీ ట్రోఫీ విదర్భ సొంతమైంది. ఐదురోజుల పాటు ఉత్కంఠగా సాగిన టైటిల్ పోరులో తొలిసారి ఫైనలిస్ట్ కేరళపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం (37 పరుగులు) సాధించిన విదర్భ ఛాంపియన్‌గా అవతరించింది. గతంలో వరుసగా రెండు సీజన్లలో విజేతగా నిలిచిన విదర్భకు ఇది ఓవరాల్‌గా మూడో రంజీ ట్రోఫీ టైటిల్. విదర్భ బ్యాటర్ డానిశ్ మలేవార్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా, విదర్భ పేసర్ హర్ష్ దూబె 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు. ఇదిలా ఉండగా రంజీ ట్రోఫీ ఫైనల్ డ్రాగా ముగిసింది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 379 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 375/9 పరుగులు చేసింది. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 342 పరుగులే చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్ విదర్భను వరించింది. రంజీ




ఛాంపియన్ విదర్భ రూ.5 కోట్లు, రన్నరప్ కేరళ రూ.3 కోట్ల నగదు బహుమతి దక్కించుకున్నాయి.



# ఓటీటీలోకి వచ్చేసిన సంక్రాంతికి వస్తున్నాం.. స్ట్రీమింగ్ ఎక్కడంటే.!

విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం . ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. మీనాక్షి చౌదరి , ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించారు. ఈ సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఒకేసారి అటు టీవీతో పాటు ఓటీటీలో విడుదల చేసింది. జీటీవీలో నిన్న ప్రీమియర్ అయిన ఈ చిత్రం.. ప్రస్తుతం ఓటీటీ వేదిక జీ5లో తెలుగుతో పాటు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది.

# హిమాలయాలకు వెళ్లనున్న అఖండ-2

బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ-2' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. బ్లాక్‌బస్టర్ హిట్ 'అఖండ'కు సీక్వెల్ ఇది. బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్‌లో ఇప్పటికే హ్యాట్రిక్ విజయాలు నమోదవడంతో ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. తదుపరి షెడ్యూల్ కోసం దర్శకుడు బోయపాటి శ్రీను హిమాలయాల్లో లొకేషన్ రెక్కీ చేస్తున్నారు. అక్కడి సుందరమైన ప్రదేశాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను తెరకెక్కించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ సీన్స్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదలకానుంది. సంయుక్త మీనన్, ఆది పినిశెట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపీ ఆచంట, రచన-దర్శకత్వం: బోయపాటి శ్రీను.



# గ్లామర్ ఓవర్ లోడెడ్.. అందాలతో సెగ పుట్టిస్తున్న రకుల్

అందాల ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టింది. ఈ మూవీతో మంచి ఫేమ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ తర్వాత వరసగా ఆఫర్స్ అందుకుంది.కెరీర్ స్టార్టింగ్‌లో టాలీవుడ్ ను షేక్ చేసిన ఈ బ్యూటీ, స్టార్ హీరోల సరసన ఆఫర్స్ అందుకొని అనతి కాలంలోనే స్టార్ హీరోయిన్ అయిపోయింది. ఇక ఈ అమ్మడుకు తెలుగులో అవకాశాలు తగ్గడంతో, బాలీవుడ్ వైపు కన్నేసి అక్కడ తన గ్లామర్‌తో అందరినీ ఆకట్టుకుంది.అంతే కాకుండా బాలీవుడ్ నటుడు నిర్మాత జాకీ భగ్నానీ నీ ప్రేమించి, పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. ఇక పెళ్లి తర్వాత ఈ ముద్దుగుమ్మ ఓ వైపు సినిమాలు, మరో వైపు తన బిజినెస్‌లలో ఫుల్ బిజీ అయిపోయింది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తాజాగా తన లేటెస్ట్ ఫొటో షూట్‌తో కుర్రకారు మనసు దోచేసుకుంది.





# దక్షిణాదిలో నటిగా కొనసాగడం కష్టం

నా 28వ ఏటే ఇద్దరు పిల్లలకు తల్లిని అయ్యాను. ఆ తర్వాత కూడా ఎన్నో విభిన్నమైన పాత్రలు చేశా. కానీ స్టార్ హీరోల సరసన మాత్రం అవకాశాలు రాలేదు. దానికి కారణం.. నేను వివాహితనవ్వడమే.' అంటూ వాపోయారు నటి జ్యోతిక. ఇటీవలే ఆమె నటించిన 'డబ్బా కార్టెల్' వెబ్ సిరీస్ ఓటీటీలో విడుదలైంది. ఈ సిరీస్ ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దక్షిణాది చిత్రపరిశ్రమపై కొన్ని వ్యాఖ్యలు చేశారు జ్యోతిక. 'గతంలో నాలాంటి మహిళల కోసమే కథలు రాసే సంస్కృతి ఉండేది. గ్రేట్ డైరెక్టర్ కె.బాలచందర్ మహిళా నేపథ్యంలోనే ఎన్నో కథలు రాశారు. సినిమాలు తీశారు. పెద్ద పెద్ద నిర్మాతలు కూడా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు నిర్మించేవాళ్లు. ఇప్పుడైతే ఆ పరిస్థితి లేదు. అగ్ర హీరోలదే హవా. స్త్రీ ప్రాధాన్యతా చిత్రాలు తగ్గిపోవడానికి బడ్జెట్ కూడా ఓ కారణమైతే.. మనసు లేకపోవడం మరో కారణం. ముఖ్యంగా స్త్రీల కోసం కథలు రాసే రచయితలు ఇప్పుడు లేరు. అందుకే దక్షిణాదిలో నటిగా కొనసాగడం కష్టం. సిద్ధాంతాలకు కట్టుబడి సినిమాల్లో నటించే స్త్రీలు అక్కడ ఒంటరిపోరు చేయాల్సొస్తుంది. కానీ ఉత్తరాదిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ఇక్కడ ఇంకా లేడీ ఓరియెంటెడ్ సినిమాలు వస్తున్నాయ్. ఈ విషయంలో బాలీవుడ్ దర్శక, నిర్మాతలను, రచయితలను అభినందించకుండా ఉండలేకపోతున్నా.' అన్నారు జ్యోతిక.




# అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెలుగు టీజర్ రిలీజ్

టీవల 'పట్టుదల' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన తమిళ అగ్ర నటుడు అజిత్‌కుమార్ నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' . ఈ సినిమాకు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి తెలుగు టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలో అజిత్ ఏకే అనే గ్యాంగ్‌స్టర్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకి జీవి ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

# హెబ్బా.. ఏముంది అబ్బా

## అందాలతో కేకపుట్టిస్తుందిగా..

టాలీవుడ్ గ్లామర్ బ్యూటీ హెబ్బా పటేల్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. అలా ఎలా అనే సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగు పె ట్టిన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే తన నటనతో అందరినీ ఆకట్టుకుంది.తర్వాత కుమారి 21 ఎఫ్ సినిమాతో తన గ్లామర్‌తో కుర్రాకుకు నిద్రలేకుండా చేసింది. అంతే కాకుండా యూత్ కలల రాణిగా మారిపోయింది ఈ బ్యూటీ. అంతలా తన అందంతో మాయచేసింది. ఇక ఈ మూవీ తర్వాత హెబ్బాకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి.నాన్న నేను నా బాయ్ ఫ్రెండ్స్, ఎక్కడికి పోతావు చిన్నవాడా, ఈడో రకం, వాడో రకం, ఏంజిల్,24 కిస్సెస్, మిస్టర్ వంటి చాలా సినిమాల్లో నటించి మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. కానీ ఈ సినిమాలు ఈ బ్యూ టీకి అంత హైప్ ఇవ్వలేకపో యాయి.తర్వ త నటించిన ఓదేల రైల్వేస్టేషన్ సినిమాతో మరోసారి తెలుగు అభిమానుల మనసు గెలుచుకుంది ఈ ముద్దుగుమ్మ. ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు అందరూ ఫిదా అయిపోయారు. ప్రస్తుతం ఈ మూవీ సీక్వెల్‌లో హె బ్బా బిజీగా ఉన్నట్లు సమాచారం.ఇక ఎప్పుడూ సోష ల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ తాజా తన ఇన్ స్టాలో లేటెస్ట్ ఫొటోస్ షేర్ చేసింది. ఈ ఫొటోల్లో మోడ్రన్ డ్రె స్‌లో, తన నడుము అందాలను చూపిస్తూ..గ్లామర్ ట్రీట్ ఇచ్చింది హెబ్బా పటేల్. ప్రస్తుతం ఈ ఫొటోస్ సో షల్



Printed,Published by,Owened by GADDAM NAGARAJU & Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad RNI. NO TELTEL/2022/83463 & Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com